


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 315 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కడప గురువారం 16 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :315 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED :KADAPA THU 16 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kadapa, Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## ముద్రగడ పాడె మోసిన జగన్



మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం భౌతిక కాయానికి వైసీపీ అధినేత జగన్ నివాళులర్పించారు. ముద్రగడ కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పిన జగన్, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ముద్రగడ పార్థివ దేహానికి రాజకీయ ప్రముఖులు, ప్రజలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పిస్తున్నారు. కాసేపటి క్రితం ముద్రగడ అంత్యక్రియలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముద్రగడ పాడెను జగన్, వైసీపీ కీలక నేత బొత్స సత్యనారాయణ మోశారు.



## ఒకరోజు 'మావిగన్', ఇంకోరోజు 'బెంతాహై'..

### జగన్‌పై మంత్రి లోకేశ్ సెటైర్లు

- జగన్ రోజుకో మాట మార్చుతారంటూ విమర్శలు
- రాయలసీమ అభివృద్ధికి జగన్ ఒక క్యాన్సర్ గడ్డలా మారారని వ్యాఖ్యలు
- వైసీపీ ఒక హిట్ అండ్ రన్ పార్టీ అంటూ తీవ్ర ఆరోపణలు
- పరిశ్రమలను బెదిరించి, యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేశారని ఆగ్రహం

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి రోజుకో మాట, పూటకో వేషం వేస్తుంటారని, ఒకరోజు 'మావిగన్' అంటే, మరోరోజు 'బెంతాహై' అంటారని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తాము చట్టప్రకారం పాలన చేస్తుంటే, లా అండ్ ఆర్డర్‌ను చేతుల్లోకి తీసుకోవాలని చూస్తే ఎవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కడప జిల్లా జమ్మలమడుగు

- మిగతా 2లో



## అమరావతి 2.0 మాస్టర్ ప్లాన్...

## సింగపూర్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమీక్ష

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ఆర్థిక ప్రగతికి చోదక శక్తిగా, ప్రపంచ స్థాయి నగరంగా అమరావతిని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి ప్రజలు వచ్చి నివసించేలా రాజధాని ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ ఉండాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమరావతి 2.0 ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ పనుల పురోగతిపై ఆయన ఉన్నతాధికారులు, సింగపూర్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు

- మిగతా 2లో




## అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం: సీఎం చంద్రబాబు





- మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన
- రూ. 35 వేల కోట్ల బడ్జెట్‌తో పనులు చేపడతామని వెల్లడి
- రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం
- గత ఐదేళ్లలో ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా విఫలమైందని విమర్శలు
- కేఎల్ రావు జయంతి, పట్టిసీమ జలహారతి కార్యక్రమంలో కీలక హామీలు

- మిగతా 2లో

### విమర్శలే కాదు.. మోసాన్ని మ్యూజియంలో పెడతా

"వెలిగోండ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే, సొరంగంలో యంత్రి ఇరుక్కుపోయిన విషయాన్ని దాచిపెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు బోర్డు పెట్టి నాటకాలాడారు. ప్రజలను ఇంత దారుణంగా మోసం చేస్తారా? వారి మోసానికి ప్రతీకమైన ఆ ప్రారంభోత్సవ బోర్డును మ్యూజయంలో పెట్టి, ప్రజలకు శాశ్వతంగా గుర్తుండేలా చేస్తాను.

**2019-24 మధ్య కాలంలో ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా విఫలమైందని, గేట్లకు కనీస నిర్వహణ కూడా చేయలేదని ఆరోపించారు. కాంట్రా క్టర్ల కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు.**




### 36 ప్రాజెక్టులు, 3 సంవత్సరాలు

రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 కీలక సాగునీటి ప్రాజెక్టులను రూ.35 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేస్తాం

| | |
|---|---|
| పోలవరం ప్రాజెక్టు | – 2027 మార్చి నాటికి పూర్తి |
| వెలిగోండ ప్రాజెక్టు (తొలిదశ) | – 2025 సెప్టెంబర్ 1న ప్రారంభం |
| గుంటూరు ఛానల్ ఆధునికీకరణ | – 2026 జూన్ నాటికి పూర్తి |
| చింతలపూడి ఎత్తిపోతల | – 2026 ఆగస్టు కల్లా పూర్తి |
| వరికపూడిశెల ప్రాజెక్టు | – 2027 జూన్ నాటికి పూర్తి |

### మహనీయుల స్ఫూర్తితో ముందుకు



డా. కేఎల్ రావు | సర్ ఆర్థర్ కాటన్ | శివరామకృష్ణయ్య | నందమూరి తారకరామారావు

ధవళేశ్వరం, తుంగభద్ర బ్యారేజీల గేట్ల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టామని తెలిపారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



## చంద్రబాబు సానుభూతిపరులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారు

- భీమవరంలో ఆక్వా రైతులతో జగన్ ముఖాముఖి
- ఫీడ్, సీడ్ రేట్లను చంద్రబాబు మనుషులే ఫైనల్ చేస్తారని విమర్శ
- చంద్రబాబు ప్రతి అడుగు మోసమేనని మండిపాటు

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో ఆక్వా రంగం సమస్యల సుడిగుండంలో ఉందని, ఆక్వా రైతులు దీనావస్థలో ఉన్నారని వైసీపీ అధినేత జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. భీమవరంలో ఆక్వా రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించిన జగన్... ఇష్టానుసారం ఫీడ్ ధరలు పెంచుకుంటూ పోతున్నారని ఆరోపించారు. ధరల పెరుగుదలకు హేతుబద్ధత ఉండాలని, ఒక్క పంటకు కూడా గిట్టుబాటు ధర లేదని విమర్శించారు. దున్నపోతు

- మిగతా 2లో

## క్రిప్టోపై ఆ వార్తలు అవాస్తవం.. కేంద్రం క్లారిటీ



పెన్ పవర్ డెస్క్:క్రిప్టో కరెన్సీని నియంత్రించే అంశంపై ఆలోచించాల్సిందిగా ఆర్‌బీఐ, సెబీలను ఆర్థిక మంత్రిత్వ శాఖ సూచించినట్లు సామా జిక మాధ్యమాల్లో జరుగుతున్న

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# జగన్ 'ఇలా.. ఇలా..' : చంద్రబాబు మరోలా!

రాజకీయ నేతలకు తమ మాటే ఒక ఆయుధం. బాడీ లాంగ్వేజ్ (వ్యవహారశైలి/ఆహార్యం) ప్రజలను కనెక్ట్ చేసే బలమైన వారధి. వేదికపైకి రాగానే చేసే చిన్న సైగ, పదే పదే పలికే ఒక పదబంధం, లేదా ఒక ప్రత్యేకమైన శైలి ఆ నాయకుడికి ప్రజల్లో ఒక ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్‌ను క్రియేట్ చేస్తాయి. తాజాగా భీమవరం సభలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనదైన ట్రేడ్ మార్క్ శైలిలో అక్వా రైతుల సమస్యలను ఎలుగెత్తి చాటారు. అక్వా రైతుల సమస్యలను తెలుసుకునేందుకు పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటించిన జగన్ ప్రభుత్వం చెప్పిన విధంగా ఫీడ్, సీడ్ ధరలు తగ్గలేదని నిరూపించేందుకు రైతులతో 'ఇలా.. ఇలా.. ఇలా..' చేతులు ఊపండని జగన్ చెప్పించారు. ఈ సన్నివేశం అందరినీ ఆకట్టుకుంది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల్లో నేతలు ఒక్కొక్కరిది ఒక్కోస్టైల్ అంటూ చర్చ జరుగుతోంది.

**జగన్మోహన్ రెడ్డి : పదే పదే.. గట్టిగా..**

మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రసంగాల్లో ఒక లయ ఉంటుంది. ప్రభుత్వాన్ని విమర్శించేటప్పుడు ఒక పదాన్ని రెండు మూడు సార్లు నొక్కి చెప్పడం ఆయన అలవాటు. "ఇలా.. ఇలా.. ఇలా..", "గట్టిగా చేతులు ఊపండి" అంటూ కార్యకర్తలను ఉత్సాహపరచడం, సభలో జోష్ నింపడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. తన ప్రసంగాల్లో భావోద్వేగాలను పండించడంలో, ప్రత్యర్థులపై విమర్శనాస్త్రాలను గుప్పించడంలో జగన్ తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలిని ఏర్పరచుకున్నారని చెబుతుంటారు.

**చంద్రబాబు స్టైల్ విక్టరీ**

ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు తనదైన హుందాతనంతో ప్రజలకు అభివాదం చేస్తుంటారు. వేదికపై ఎక్కగానే రెండు వేళ్లతో 'విక్టరీ సింబల్' చూపడం ఆయన ట్రేడ్ మార్క్. ఇది కేవలం ఒక సైగ మాత్రమే కాదు, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపే ఒక సంకేతం. దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో చంద్రబాబును చూడగానే అభిమానులు సైతం విక్టరీ సింబల్ చూపుతుంటారు. తెలుగు నేలపై మరే నేతకు ఇటువంటి అభివాదం ఉండదు. చంద్రబాబు మాదిరిగానే టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైతం విక్టరీ సింబల్ తోనే అభివాదాలు చేస్తుంటారు.

**వైఎస్ రాజశేఖరరెడ్డి : కుయ్.. కుయ్..**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాట తీరులో ఉండే నేర్పు, ప్రజలకు అర్థమయ్యే సరళత అద్భుతం. ఆయన ప్రసంగాలంటేనే ఒక భరోసా. ఉదాహరణకు, 108 అంబులెన్స్ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఆయన చెప్పిన "కుయ్.. కుయ్.. కుయ్.. అంటూ అంబులెన్స్ వస్తుంది" అనే మాట ఇప్పటికీ అందరికీ గుర్తే. సంక్లిష్టమైన పథకాలను కూడా సామాన్యుడికి అర్థమయ్యేలా, తన మాటలతో వారి మనసు గెలుచుకోవడం వైఎస్సార్‌కే చెల్లిందని ఆయన అభిమానులు చెబుతుంటారు.

**కేసీఆర్: యాసలో ఆత్మగౌరవం**

తెలంగాణకు చెందిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉపన్యాస శైలిని ఎవరూ అనుకరించలేరు. తెలంగాణ యాసను, సంస్కృతిని తన మాటల్లో జోడించి, ప్రజల్లో ఆత్మగౌరవాన్ని రగిల్చడం ఆయన ప్రత్యేకత. చమత్కారాలు, వ్యంగ్యాస్త్రాలు, పురాణ గాథలు, ఉర్దూ, తెలుగు పదాల మిశ్రమంతో ఆయన చేసే ప్రసంగాలు సభికులను కట్టిపడేస్తాయి. "ఏం జరగాలి?", "ఏం కావాలి?" అని ఆయన పలికే తీరులో ఒక రకమైన ఆవేశం, వాదన కనిపిస్తుంది.

**రేవంత్ రెడ్డి: దూకుడు.. ఆవేశం**

ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాల్లో దూకుడు కనిపిస్తుంది. ఆయన మాటల్లో ఆవేశం, వాస్తవాలను ఎత్తిచూపే ధైర్యం ఉంటాయి. ప్రత్యర్థులను అడ్రస్ చేసే విధానం, ప్రజల సమస్యలపై స్పందించే తీరులో ఒక రకమైన 'కౌంటర్' ఫాలో అవుతుంటారు. ప్రజలతో నేరుగా కనెక్ట్ అయ్యేందుకు ఆయన వాడే భాష, ఉపయోగిస్తున్న బాడీ లాంగ్వేజ్ ఆయనకు యువతలో ఒక ప్రత్యేక క్రేజ్‌ను తెచ్చిపెట్టాయి.

నాయకుల వ్యవహారశైలి గమనిస్తే బహిరంగ సభలు లేదా సమావేశాల్లో నాయకుడు చెప్పే అంశం ఎంత ముఖ్యమో, దాన్ని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్తున్నారనేది అంతకంటే ముఖ్యమని అంటున్నారు. తమదైన హావభావాలు, ట్రేడ్ మార్క్ మాటలతో ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకోవడం మన నేతల నైజం అంటున్నారు.

# క్రిప్టోపై ఆ వార్తలు అవాస్తవం.. కేంద్రం క్లారిటీ

- మొదటి పేజి తరువాయి

ప్రచారాన్ని కేంద్రం ఖండిం చింది. అవన్నీ అవాస్తవాలని కొట్టిపారేసింది. అలాంటి ప్రతిపాదనలేవీ లేవని స్పష్టం చేసింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం ఎక్స్ వేదికగా స్పందించింది. క్రిప్టో కరెన్సీపై ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి ఎలాంటి ఆదేశాలు జారీకాలేదని కేంద్రం పేర్కొంది. క్రిప్టోను ఒక చట్టబద్ధమైన ఆస్తిగా పరిగణించడం లేదని స్పష్టం చేసింది. ఇలాంటి వదంతులను నమ్మొద్దని తెలిపింది. విశ్వసనీయం సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌లనే సందర్శించాలని సూచించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తప్పుడు కథనాలు వ్యాప్తి జరిగినప్పుడు వెంటనే కేంద్రం దృష్టికి తీసుకురావాలని కోరింది. ఇందుకు ०91 8799711259 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలని లేదంటే factcheck@pib.gov.in మెయిల్ చేయాలని సూచించింది.

## ఆ సబ్ రిజిస్ట్రార్ రూటే సెపరేటు... ఎపిసోడ్ -2

# ఇక్కడ నేనే రూల్...

- భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై వివాదం..
- ప్రైవేట్ సిబ్బందితో విధులు, ప్రజలకు ఇబ్బందుల ఆరోపణలు
- ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల జోక్యం..?
- ప్రభుత్వ ఉద్యోగులను పక్కనబెట్టి ప్రైవేట్ సిబ్బందితో విధులు
- రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలకు వేధింపుల ఆరోపణలు
- సున్నితమైన ప్రభుత్వ రికార్డులు, బయోమెట్రిక్ ప్రక్రియలపై ప్రశ్నలు
- 'ఇక్కడ నేనే రూల్' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు
- స్వతంత్ర విచారణకు ప్రజలు, బాధితుల డిమాండ్

**ఏలూరు జిల్లా భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల స్థానంలో ప్రైవేట్ వ్యక్తులతో ప్రభుత్వ విధులు నిర్వహింపజేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు అందించాల్సిన కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం, వినియోగదారుల పట్ల అనుచిత ప్రవర్తన, ప్రభుత్వ రికార్డుల నిర్వహణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత ఉన్నతాధికారులు స్వతంత్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు, బాధితులు కోరుతున్నారు.**

**ఎడిటర్ పెన్ పవర్ , ఏలూరు జూలై 15 :** భీమడోలు గ్రామంలోని ప్రభుత్వ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో ఉన్నప్పటికీ, వారికి కేటాయించిన బాధ్యతల్లో కొంత భాగాన్ని ప్రైవేట్ వ్యక్తులతో నిర్వహింపజేస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు, సబార్డినేట్ సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ, రాణి, సంతోష్, లక్ష్మి అనే ప్రైవేట్ వ్యక్తులు కూడా కార్యాలయ పనుల్లో పాల్గొంటున్నారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలను అవసరానికి మించి వేచి ఉండేలా చేస్తున్నారని, త్వరగా పూర్తి చేయాల్సిన ప్రక్రియలను ఆలస్యం చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. కొందరితో అనుచితంగా మాట్లాడుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

ముఖ్యంగా, వేలిముద్రలు, బయోమెట్రిక్ ధృవీకరణ, రికార్డుల నిర్వహణ వంటి సున్నితమైన ప్రభుత్వ ప్రక్రియల్లో ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం ఉందని ఫిర్యాదులు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ అంశంపై ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అలాగే, ప్రశ్నించిన వారితో "ఎవరికి ఫిర్యాదు చేయాలనుకుంటే వారికి చేయండి", "ఇక్కడ నేనే రూల్" అన్న తరహాలో స్పందిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే అది ప్రభుత్వ సేవల పారదర్శకత, ప్రజా విశ్వాసంపై ప్రభావం చూపే అంశమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ఎపిసోడ్ -3 లో అయ్యవారి బాగోతాలు చిట్టా... వరుస కథనాలు విత్ ప్రూఫ్ ల తో ... పెన్ పవర్ పాఠకులకోసం**

# అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలో కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్వీర్యం చేయడం రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానమని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి వేళ, పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు నీటిని విడుదల చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన 'జలహారతి' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగంపై నిర్లక్ష్యం చూపారంటూ గణాంకాలతో సహా ఎండగట్టారు. ఒక వ్యక్తి ప్రాధాన్యతల కోసం రాష్ట్ర ప్రజల భవిష్యత్తును, రైతాంగ ప్రయోజనాలను ఫణంగా పెట్టారని తీవ్రంగా ఆరోపించారు.

**విమర్శలనే కాదు.. వారి మోసాన్ని మ్యూజియంలో పెడతా**

గత ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెట్టిన చంద్రబాబు, వారి పాలనలో జరిగిన మోసపూరిత చర్యలను తీవ్రంగా ఖండించారు. "వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే, సొరంగంలో యంత్రం ఇరుక్కుపోయిన విషయాన్ని దాచిపెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు బోర్డు పెట్టి నాటకాలడారు. ప్రజలను ఇంత దారుణంగా మోసం చేస్తారా? వారి మోసానికి ప్రతీక అయిన ఆ ప్రారంభోత్సవ బోర్డును మ్యూజియంలో పెట్టి, ప్రజలకు శాశ్వతంగా గుర్తుండేలా చేస్తాను" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. 2019-24 మధ్య కాలంలో ప్రాజెక్టుల గేట్లకు కనీసం గ్రీజు కూడా పూయని దుస్థితి ఉండేదని, పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని విమర్శించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాని దారుణమైన పరిస్థితిని సృష్టించారని మండిపడ్డారు.

తాము ఎంతో కష్టపడి పూర్తి చేసిన పట్టిసీమ ప్రాజెక్టును 'వట్టిసీమ', 'దండగ' అని ఆనాడు ప్రతిపక్షంలో ఉండి విమర్శించిన వారే, అధికారంలోకి వచ్చాక దాని విలువను గుర్తించలేకపోయారని అన్నారు. "నేను ఆ రోజు వారి విమర్శలకు భయపడి ఉంటే, ఈ పదేళ్లలో కృష్ణా డెల్టా పరిస్థితి ఏమై ఉండేదో ఒక్కసారి ఆలోచించండి. పట్టిసీమ ద్వారా గడిచిన పదేళ్లలో 450 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణాకు తరలించి 13 లక్షల ఎకరాలను స్థిరీకరించాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**36 ప్రాజెక్టులు, 3 సంవత్సరాలు**

విమర్శలకే పరిమితం కాకుండా, రాష్ట్రాన్ని జల సమృద్ధంగా మార్చేందుకు తమ ప్రభుత్వ బృహత్ ప్రణాళికను చంద్రబాబు ఆవిష్కరించారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 కీలక సాగునీటి ప్రాజెక్టులను రూ.35 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించారు. "రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఇప్పటికే 37 సార్లు భౌతికంగా, 37 సార్లు వర్చువల్‌గా సమీక్షలు నిర్వహించాను. పునరావాసంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్వాసితులకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. తాను 1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ఈ ఏడాది సెప్టెంబర్ 1న ప్రారంభిస్తామని తెలిపారు. వీటితో పాటు వంశధార-నాగావళి-గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం తన చిరకాల స్వప్నమని, దానిని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తామని పునరుద్ఘాటించారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, చింతలపూడి ఎత్తిపోతల, వరికపూడిశెల వంటి అనేక ప్రాజెక్టుల పూర్తికి నిర్దిష్ట తేదీలను ప్రకటించి, ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని చాటుకున్నారు.

**మహనీయుల స్ఫూర్తితో ముందుకు**

ఈ సందర్భంగా డాక్టర్ కేఎల్ రావు, సర్ ఆర్థర్ కాటన్, శివరామకృష్ణయ్య, నందమూరి తారక రామారావు వంటి మహనీయులు సాగునీటి రంగానికి చేసిన సేవలను చంద్రబాబు స్మరించుకున్నారు. వారి దూరదృష్టి వల్లే ఈరోజు రాష్ట్రం అన్నపూర్ణగా నిలిచిందన్నారు. మంచి పనులు చేసిన వారిని ప్రజలు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని,

చెడును ఖండించాల్సిన బాధ్యత కూడా ప్రజలపై ఉందని హితవు పలికారు. తాము అధికారంలోకి వచ్చాక ధవళేశ్వరం, తుంగభద్ర బ్యారేజీల గేట్లను యుద్ధప్రాతిపదికన మార్పించామని, నిర్వహణ లోపాలను సరిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేఎల్ రావు కుమారుడు విజయరావు కోరిన వైకుంఠపురం బ్యారేజీ నిర్మాణాన్ని కూడా తప్పకుండా చేపడతామని హామీ ఇచ్చారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, జల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

# అమరావతి 2.0 మాస్టర్ ప్లాన్... సింగపూర్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమీక్ష

ఈ సమావేశంలో సింగపూర్ ప్రతినిధులు అమరావతి నిర్మాణానికి సంబంధించిన ప్రాజెక్టు పరిధి, అమలు ప్రణాళిక, దశలవారీ కార్యాచరణను ముఖ్యమంత్రికి వివరించారు. ఏరియా ప్లాన్, మౌలిక వసతుల కల్పన, పెట్టుబడి నమూనా వంటి కీలక అంశాలను ప్రాజెక్టులో భాగంగా చేర్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, ఉద్యోగాలు కల్పించడం ద్వారా అమరావతి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. అమరావతిని ఆర్థికంగా పరిపుష్టం చేసేలా 'క్రియేటివ్ సిటీ' నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణంతో అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. ఎల్‌నినోతో ఇబ్బందులు ఎదురైనా, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా నదికి తరలించడంతో రాజధాని ప్రాంతం జలకళను సంతరించుకుందని గుర్తుచేశారు. గ్లోబల్ బెంచ్‌మార్కింగ్ చేరుకోవడం, రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం గణనీయంగా పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ బిల్డింగ్ విధానాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పి.నారాయణ, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఒకరోజు 'మావిగన్', ఇంకోరోజు 'బెంతాహై'..

- మొదటి పేజి తరువాయి

సమీపంలోని చిన్నకొమెర్లలో దాల్మియా సిమెంట్ ప్లాంట్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్, వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

**రాయలసీమ అభివృద్ధికి క్యాన్సర్ గడ్డ జగన్**

రాయలసీమ అభివృద్ధికి జగన్మోహన్ రెడ్డి ఒక క్యాన్సర్ గడ్డలా మారారని లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బ్రాహ్మణి స్టీల్ ప్లాంట్ పేరుతో ప్రత్యక్షంగా 10 వేల ఉద్యోగాలు, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. "మైనింగ్ లైసెన్స్ తీసుకుని సుమారు 320 ఎకరాల్లో 'రెడ్ గోల్డ్' సంస్థ పేరుతో ఐరన్ ఓర్‌ను తరలించి విక్రయించుకున్నారు. దీనివల్ల గాలి జనార్దన్ రెడ్డికి, జగన్‌కు ఆదాయం వచ్చింది తప్ప, కడప యువతకు ఒక్క ఉద్యోగం కూడా రాలేదు" అని విమర్శించారు. తాము తెచ్చిన కియా పరిశ్రమ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మంది జీవనం సాగిస్తున్నారని, ఇదే ప్రజాప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు.

**పరిశ్రమలను బెదిరించిన గొడ్డలి పార్టీ**

2019 నుంచి 2024 వరకు కియా యాజమాన్యాన్ని గొడ్డలి పార్టీ నేతలు బెదిరించారని లోకేశ్ ఆరోపించారు. దాల్మియా సిమెంట్‌కైతే ఏకంగా ఫ్యాక్టరీ మూసేయాలని నోటీసులు ఇచ్చారని, డబ్బులిస్తేనే ఫ్యాక్టరీ నడుస్తుందని, లేదంటే మూసేయాలనే ధోరణిలో వైసీపీ నేతలు ప్రవర్తించారని అన్నారు. "మేం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో మూడుసార్లు కడప జిల్లాకు వచ్చాం. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించాం, ఇప్పుడు దాల్మియా విస్తరణకు శంకుస్థాపన చేశాం. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణే మా నినాదం. దేశంలోనే రికార్డు స్థాయిలో రాష్ట్రానికి పరిశ్రమలు తెస్తున్నాం" అని తెలిపారు.

**వైసీపీ ఒక 'హిట్ అండ్ రన్' పార్టీ**

జగన్ రెడ్డి పార్టీకి 'హిట్ అండ్ రన్ పార్టీ' అని పేరు పెట్టవచ్చని లోకేశ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "జగన్ కాన్వాయ్ వాహనం ఢీకొని ఆ పార్టీ కార్యకర్త సింగయ్య చనిపోతే, శవాన్ని రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయారు. నిజాయతీ ఉంటే కోర్టుకు వెళ్లి స్టే ఎందుకు తెచ్చుకున్నారు? సొంత బాబాయ్‌నే హత్య చేస్తే తప్పు కాదు, కార్యకర్త చనిపోతే తప్పు కాదు" అని తీవ్రంగా విమర్శించారు. తమ హయాంలో మత్స్యకారులు చనిపోతే ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చామని, కానీ జగన్ పాలనలో 250 మంది మత్స్యకారులు చనిపోతే వారి కుటుంబాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఉద్యోగాల కల్పనలో విఫలం**

ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్క జాబ్ క్యాలెండర్ కూడా ఇవ్వలేదని, కానీ తాము అధికారంలోకి వచ్చిన 150 రోజుల్లోనే 16,000 డీఎస్సీ పోస్టులు భర్తీ చేశామని లోకేశ్ గుర్తుచేశారు. కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పూర్తి చేసి, త్వరలో కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

పెట్రోల్,

డీజిల్ ధరలపై జగన్ చేస్తున్న విమర్శలను తిప్పికొడుతూ, "జగన్ హయాంలో క్రూడ్ ఆయిల్ ధరలు పెరగకపోయినా పెట్రోల్, డీజిల్ ధరలు రూ.35 పెంచారు. అప్పుడు నోరు మెదపని జగన్ ఇప్పుడు విమర్శించడం విడ్డూరంగా ఉంది. అధికారం పోతే ఒక నీతా?" అని ప్రశ్నించారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, గండికోట జలాలను సమర్థంగా వినియోగించుకుంటామని లోకేశ్ స్పష్టం చేశారు.

# పోక్సో కేసులో జగిత్యాల కోర్టు సంచలన తీర్పు... ఐదుగురికి జీవిత ఖైదు..

జగిత్యాల జిల్లాలో సంచలనం రేపిన మైనర్ బాలిక గ్యాంగ్ రేప్ కేసులో సంచలన తీర్పునిచ్చింది కోర్టు. 2020లో మెట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనపై బుధవారం ( జులై 15 ) తీర్పు వెల్లడించింది కోర్టు. ఈ కేసుకు సంబంధించి ఐదుగురు నిందితులను దోషులుగా తేల్చిన ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక పోక్సో కోర్టు.. వారికీ జీవిత ఖైదు విధించింది. అంతే కాకుండా.. ఒక్కో దోషికి రూ.20 వేల జరిమానా విధించిన కోర్టు.. బాధిత మైనర్ బాలికకు రూ.12 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. పటిష్ట ఆధారాలతో పోలీసులు, ప్రాసిక్యూషన్ కేసు నిరూపించడంతో ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి రత్న పద్మావతి కీలక తీర్పు వెల్లడించారు. ఇటీవల షాబాద్ లో పోక్సో కేసు నిందితుడు బెయిల్ పై వచ్చి మారణకాండ సృష్టించి చివరికి తానూ ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపిన క్రమంలో జగిత్యాల పోక్సో కేసు తీర్పు ప్రాధాన్యత సంతరించుకుంది. పోక్సో కేసు నిందితులకు బెయిల్ మంజూరు చేయకుండా... వీలైనంత త్వరగా కేసు నిరూపించి శిక్ష విధించాలని కోరుతున్నారు జనం.

## చంద్రబాబు సానుభూతిపరులు

# సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారు

- మొదటి పేజి తరువాయి

మీద వాన పడినట్టు ప్రభుత్వం తీరు ఉందని విమర్శించారు. ఆక్వా రంగం ఐదు లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తుందని జగన్ తెలిపారు. చంద్రబాబు సానుభూతిపరులే సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఫీడ్, సీడ్ రేట్లు చంద్రబాబు మనుషులే ఫైనల్ చేస్తారని, చంద్రబాబు సిండికేట్ రాష్ట్రాన్ని నడిపిస్తోందని ఎద్దేవా చేశారు. ఫీడ్ రేట్లు కేజీకి రూ.14 నుంచి 16కి ఎడాపెడా పెంచేశారని, ముష్టి వేసినట్టు కేజీకి రూ.2 తగ్గిస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. రేట్లు పెంచితే పెంచేస్తారని... రేట్లు తగ్గితే తగ్గించరా అని మండిపడ్డారు. వైసీపీ హయాంలో ఆక్వా రైతుల కోసం 'అప్సడా' ఏర్పాటు చేశామని... సీడ్, ఫీడ్, మార్కెటింగ్‌లో సమస్యలు వస్తే పరిష్కరించామని గుర్తు చేశారు. చంద్రబాబు వచ్చాక 'అప్సడా'ను నిర్వీర్యం చేశారని విమర్శించారు. రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్నామని, రొయ్యలకు మద్దతు ధర తగ్గకుండా మానిటర్ చేశామని తెలిపారు. రైతుకు గిట్టుబాటు ధర తగ్గకూడదని చట్టం చేశామన్నారు.

ఈరోజు కేజీ కౌంట్ రూ.230లు దాటని పరిస్థితి ఉందని చెప్పారు. ఆక్వా రైతులకు తాము 1.50కే యూనిట్ విద్యుత్ అందించామని, ఐదేళ్లలో సబ్సిడీ కింద రూ.3,306 కోట్లు చెల్లించామని గుర్తు చేశారు. చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.401 కోట్ల సబ్సిడీ బకాయిలు చెల్లించామన్నారు. చంద్రబాబు ప్రతి అడుగు మోసమని విమర్శించారు. ఆక్వా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చారా? అని ప్రశ్నించారు.

# వరుసగా మూడోసారి ఏకగ్రీవ ఎన్నిక



**పెన్ పవర్,ప్యాపిలి:** మండల పరిధిలోని చంద్రపల్లి గ్రామానికి చెందిన కే.బీ. దామోదర్ నాయుడు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండల అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నంద్యాల బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆదేశాల మేరకు బుధవారం నంద్యాల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయనను మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దామోదర్ నాయుడు మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మండలంలోని ప్రతి గ్రామంలో విస్తృతంగా పర్యటించి బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు దీటుగా పార్టీని మండలంలో బలోపేతం చేసి ప్రజల్లో ఆదరణ పెంచేందుకు నిరంతరం శ్రమిస్తానన్నారు. అలాగే కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ, పార్టీ అభివృద్ధికి కీలకంగా పనిచేస్తానని పేర్కొన్నారు. 2029 నాటికి మండలంలోని ప్రతి గ్రామంలో భారతీయ జనతా పార్టీ జెండా ఎగురవేసే లక్ష్యంతో ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు. దామోదర్ నాయుడు వరుసగా మూడోసారి మండల అధ్యక్షుడిగా ఎన్నిక కావడంపై భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# పార్టీ బలోపేతం.. స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యం

## నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





**కోవూరు పెన్ పవర్ జులై 15 :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆదేశాల మేరకు బుధవారం కోవూరులో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు అంకితభావంతో పనిచేశాయని అభినందించారు. అయితే ప్రక్రియ పూర్తయిందని భావించకుండా ఎన్నికల సంఘం ఇచ్చిన అదనపు గడువు 10 రోజులను సద్వినియోగం చేసుకుని లింకేజ్, మ్యాపింగ్ వంటి మిగిలిన సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన పార్టీ యూనిట్ స్థాయి సమావేశాలను ప్రస్తావిస్తూ, ప్రతి కార్యక్రమాన్ని మై టీడీపీ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. పని చేయడం ఎంత ముఖ్యమో, పార్టీకి ఆ పని కనిపించేలా యాప్‌లో సకాలంలో అప్‌లోడ్ చేయడం కూడా అంతే ముఖ్యమని చెప్పారు. అవగాహన లేని వారు ఇతర నాయకుల సహాయం తీసుకుని నమోదు చేయాలని సూచించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో అత్యధిక శాతం అమలు చేసిందని ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ గ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం తిరిగి అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. ఒక్క కోవూరు నియోజకవర్గంలోనే సుమారు రూ.770 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. మైపాడు రహదారి, ముదువర్తి కాజ్‌వే వంటి కీలక పనులు పూర్తయ్యాయని, మల్దేవి రహదారి పనులు చివరి దశలో ఉన్నాయని, కనిగిరి రిజర్వాయర్ పనులను కూడా ప్రభుత్వం పూర్తి చేయనున్నట్లు వివరించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల మధ్య కూడా ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిందని, కొత్త ఇళ్లు, పెన్షన్ల మంజూరు వంటి కార్యక్రమాలు కూడా కొనసాగుతాయని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కోవూరు నియోజకవర్గంలోని ఆపదలో ఉన్న కుటుంబాలకు సుమారు రూ.11 కోట్ల ఆర్థిక సాయం అందించారని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత భేదాభిప్రాయాలను పక్కనపెట్టి పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఏ ప్రాంతంలో రెండు వర్గాలు ఉన్నా ఎన్నికల సమయంలో అందరూ ఏకమై తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. అంతర్గత విభేదాలు ప్రత్యర్థులకు అవకాశంగా మారకుండా జాగ్రత్తపడాలని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే అందరు నాయకులు, కార్యకర్తలకు మాట్లాడే అవకాశం కల్పించారు. వారి సమస్యలు, సూచనలను విన్నారు. అనంతరం ఎస్ ఐ ఆర్ ప్రక్రియతో పాటు మై టీడీపీ యాప్‌లో 100 శాతం పనితీరు కనబరిచిన 135వ బూత్ ఇన్‌చార్జి నాటకరాణి వెంకట్‌ను ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అనంతరం సమావేశానికి హాజరైన కార్యకర్తలకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్వయంగా భోజనాలు వడ్డించి ఆప్యాయతను చాటుకున్నారు.

## దామరమడుగు గ్రామ ప్రజలకు, రైతు సోదరులకు శుభవార్త

**కొన్ని దశాబ్దాలుగా మన గ్రామ ప్రజలు మరియు రైతాంగం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న దామరమడుగు – కోవూరు కాలువ బ్రిడ్జి నిర్మాణ కల నెరవేరబోతోంది!**



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జులై 15 :** ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రత్యేక చొరవతో, అలాగే అర్జున్ రెడ్డి యూత్ నిరంతర కృషి ఫలితంగా... ఈ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 80 లక్షల నిధులు మంజూరయ్యాయి. ?గమనిక: అత్యంత త్వరలోనే ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. ?దశాబ్దాల నాటి మన గ్రామ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన శాసనసభ్యులకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

## షేక్ మస్తాన్ సాయి కుటుంబానికి 10వేల రూపాయలు ఆర్థిక సాయం చేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జులై 15 :** దామరమడుగు గ్రామం, తూర్పు వీధికి చెందిన షేక్ మస్తాన్ సాహెబ్ స్వర్గస్తులైనారు. ఈ విషయం తెలుసుకున్న కొవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించి, వారి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా రూ. 10,000/- ప్రకటించారు. ఎమ్మెల్యే సూచన మేరకు, తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు కొర్నా శేషు ఉపాధ్యక్షులు మట్టిపల్లి చంద్రమోహన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎస్టి బద్రుద్దీన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గౌస్ భాషా , బాబు అలాగే గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు స్వయంగా వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో తాము ఎల్లప్పుడూ ముందుంటామని ఈ సందర్భంగా నాయకులు తెలియజేశారు.

# మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు

## శ్రీవారి భక్తులకు టీటీడీ అదనపు ఈవో విజ్ఞప్తి



**తిరుమల పెన్ పవర్ జూలై 15 :** తిరుమల శ్రీవారి దర్శనం, వసతి గదులు, ఆర్జిత సేవలు తదితర బుకింగ్‌ల కోసం భక్తులు తప్పనిసరిగా టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే బుకింగ్ చేసుకోవాలని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి కోరారు. సోషల్ మీడియా వేదికలలో, అనధికారిక వెబ్‌సైట్లలో, మధ్యవర్తుల ద్వారా వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మి మోసపోవద్దని భక్తులకు సూచించారు. భక్తుల విశ్వాసాన్ని ఆసరాగా చేసుకుని కొందరు నకిలీ వెబ్‌సైట్లు, అక్రమ మార్గాల ద్వారా డబ్బులు వసూలు చేసే ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని, అలాంటి వారి బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. శ్రీవారి దర్శనం, వసతి, సేవల బుకింగ్‌లు, టికెట్ల విడుదల, రద్దు అయిన టికెట్ల లభ్యత, వివిధ దర్శనాల సమాచారం, వేచి ఉండే సమయం వంటి అన్ని వివరాలను టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. ఎస్వీబీసీ ద్వారా కూడా భక్తులకు నిరంతరం అధికారిక సమాచారాన్ని చేరవేస్తున్నామని చెప్పారు. టికెట్లకు సంబంధించిన ఏవైనా సందేహాలు ఉంటే టీటీడీ కాల్ సెంటర్ నెం: 155257 సంప్రదించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మధ్యవర్తులకు లేదా అనధికారిక వ్యక్తులకు డబ్బులు బదిలీ చేయవద్దని కోరారు. ఎవరైనా మధ్యవర్తులు, దళారులు , అనధికారిక వ్యక్తులు బుకింగ్‌ల పేరుతో సంప్రదించినట్లయితే టీటీడీ విజిలెన్స్ ఫిర్యాదు విభాగం ఫోన్ నెం: 98668 98630 సమాచారం అందించాలని కోరారు.

# అంగన్వాడి కేంద్రానికి అమ్మ-నాన్న ఫౌండేషన్ చేయూత



**ఆత్మకూరు పెన్ పవర్ జూలై 15 :** మర్రిపాడు మండలం డి.సి.పల్లి గ్రామానికి చెందిన అమ్మ-నాన్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు చింతలపల్లి మధుసూదన శాస్త్రి గ్రామంలోని అంగన్వాడి కేంద్ర అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలను అందించి అభినందనలు అందుకున్నారు. అంగన్వాడి కేంద్రాన్ని చిన్నారులను ఆకట్టుకునేలా, విద్యాభివృద్ధికి అనుకూలంగా తీర్చిదిద్దే లక్ష్యంతో భవన గోడలపై రంగురంగుల చిత్రాలు,విద్యాపరమైన పెయింటింగ్స్ వేయించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అలాగే చిన్నారుల రక్షణ కోసం వరండాకు గ్రిల్స్ ఏర్పాటు చేయించి,వారి కోసం ఆట వస్తువులు,కుర్చీలు,ఇతర క్రీడా,వినోద పరికరాలు మరియు విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి నాగేశ్వర వరప్రసాద్ మాట్లాడుతూ,చిన్నారుల సమగ్ర అభివృద్ధి కోసం మధుసూదన శాస్త్రి అందించిన సహాయం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యతో పాటు చిన్నారుల సృజనాత్మకత,ఆటపాటల అభివృద్ధికి ఉపయోగపడే వాతావరణాన్ని కల్పించడం ద్వారా ఆయన సమాజానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. గ్రామాభివృద్ధి,విద్యాభివృద్ధి కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. దాత మధుసూదన శాస్త్రి మాట్లాడుతూ తన తండ్రి స్వర్గీయ చింతలపల్లి లక్ష్మీనరసయ్య శాస్త్రి జ్ఞాపకార్థం,తన తల్లి నాగమణి ఆధ్వర్యంలో అమ్మ-నాన్న ఫౌండేషన్ ను ఏర్పాటు చేశామని,ఈ ఫౌండేషన్ ద్వారా విద్య,సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి తిరుపతయ్య,సీడీపీఓ శర్మిష్ఠ,అంగన్వాడి సూపర్వైజర్ నారాయణమ్మ, విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి జొన్నా సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి మహేంద్ర, కలిశెట్టి రాజేంద్ర కుమార్,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, డి.సి.పల్లి ఎస్సీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్,అంగన్వాడి కార్యకర్త సుజాత,ఆయా రత్నమ్మ,మధుసూధన శాస్త్రి సతీమణి వాణి,గ్రామ పెద్దలు,విద్యార్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మసీదు, ముస్లిం కాలనీ స్థలాన్ని పార్క్ పేరుతో ఆక్రమించొద్దంటూ వినతి



**ఆత్మకూరు పెన్ పవర్ జులై 15 :** ఆత్మకూరు మండలం మహిమలూరు గ్రామంలో సర్వే నంబర్ 170లో ప్రభుత్వం 1980లో మసీదు నిర్మాణం మరియు ముస్లిం కాలనీ ఏర్పాటు కోసం కేటాయించిన స్థలాన్ని కొందరు పార్క్ పేరుతో ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన ముస్లింలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మహిమలూరు గ్రామానికి చెందిన ముస్లిం ప్రతినిధులు ఆత్మకూరు ఎమ్మార్వో కార్యాలయాన్ని కలిసి సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని యథాతథంగా పరిరక్షించి, మసీదు మరియు ముస్లిం కాలనీ నిర్మాణానికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. అలాగే స్థలంపై ఎలాంటి ఆక్రమణలు జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన షేక్ ఫరీద్ భాషా, పీకే ఖాజా రంతుల్లా, మీరవలి, షేక్ అజమతుల్లా, షేక్ రహమత్, షేక్ జమీర్, షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు

# అంగన్‌వాడీ కేంద్రాల ఆధునీకరణే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ





**నాయుడుపేట, పెన్ పవర్, జూలై 15 :** అంగన్వాడీ కేంద్రాల ఆధునీకరణ కూటమి ప్రభుత్వ లక్ష్యం అని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలియజేశారు. బుధవారం నాయుడుపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించే కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన ఆధునిక పరికరాలను పంపిణీ చేశారు. ప్రాజెక్ట్ పరిధిలోని 216 అంగన్‌వాడీ కేంద్రాలకు 216 ఇండక్షన్ స్టౌలను,అలాగే టాటా ట్రస్ట్ సహకారంతో 277 మంది లబ్ధిదారులకు బాలామృతం ప్లస్ కిట్లను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం మహిళలు, గర్భిణీలు,బాలింతలు, చిన్నారుల సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన సేవలతో పాటు ఆధునిక సౌకర్యాలు కల్పించడం ద్వారా చిన్నారులకు మెరుగైన అభ్యాస వాతావరణాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇండక్షన్ స్టౌలతో పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణంలో పోషకాహారం తయారు చేయవచ్చని, టాటా ట్రస్ట్ సహకారంతో అందిస్తున్న బాలామృతం ప్లస్ కిట్లు గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల పోషకాహార స్థాయిని మరింత మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.వసంత బాయి, నోడల్ ఆఫీసర్ వసంతి, నాయుడుపేట ఏ ఎం సి చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్,నాయుడుపేట పట్టణ టిడిపి అధ్యక్షులు షేక్ రఫీ,తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి,డాక్టర్ దారా అంకయ్య, విజయ్ కుమార్ నాయుడు,చిట్టేటి చెంచయ్య, కాపులూరు చక్రపాణి, బల్లి ముత్యాలయ్య, మొండెం బాబు,పలువురు నాయకులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారికి ఒకేరోజు భారీగా విరాళాలు

**తిరుమల పెన్ పవర్ జూలై 15 :** తిరుమల శ్రీవారిని దర్శించుకునే భక్తులు టీటీడీకి భారీ విరాళాలను అందిస్తున్నారు. ప్రధానంగా టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించే ట్రస్టులకు గత రెండేళ్లుగా విరాళాలు పెరిగాయి. టీటీడీకి ఒక్కరోజే భారీగా విరాళాలు అందాయి. టీటీడీ అన్న ప్రసాదం ట్రస్టుకు ఒక్కరోజులో రూ.60.61 లక్షలు విరాళంగా భక్తులు అందజేశారు. విశాఖపట్నానికి చెందిన ఎస్ఎస్ఎన్ఆర్ ప్రోజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.10.50 లక్షలు.. మరో భక్తుడు విశ్వ సీవీ చెరుకూరి రూ.10 లక్షలు, వంత ఇన్ ఫ్రా కాన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.10 లక్షలు, వెర్టెక్స్ కౌంటీ ఎల్ఎల్పీ సంస్థ రూ.10 లక్షలు, హైదరాబాద్‌కు చెందిన శ్రీ సాయిలీల ఎలక్ట్రికల్ ప్రోజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.10 లక్షలు, అమరావతిలోని తుళ్లూరుకు చెందిన జొన్నలగడ్డ కిరణ్ కుమార్ రూ.10,11,116 విరాళంగా అందించారు. ఈ మేరకు దాతల తరఫున టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు తిరుమలలోని టీటీడీ ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఛైర్మన్ బీఆర్ నాయుడుకు విరాళం డీడీలను అందజేశారు. మరోవైపు గుంటూరుకు చెందిన బృందా న్యూరో సెంటర్ టీటీడీ శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10,00,116, శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10,00,116, బర్డ్ ట్రస్టుకు రూ.10,00,116 విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ సంస్థ అధినేతలు డాక్టర్ హనుమ శ్రీనివాస రెడ్డి, సిద్ధార్థలు శ్రీవారి ఆలయంలోని రంగ నాయకుల మండపంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్రకు విరాళం డీడీలను అందజేశారు. బెంగుళూరుకు చెందిన శ్రీపతి శ్రీనివాస్, కొటారు సునీల్‌లు శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10,00,116 విరాళంగా అందించారు. విశాఖపట్నంకు చెందిన చాగర్లమూడి సీతారామయ్య టీటీడీ బర్డ్ ట్రస్టుకు రూ.10,00,116 విరాళంగా అందించారు. వీరి తరఫున టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్రకు విరాళం డీడీలను అందజేశారు.

# టీటీడీ పాలకమండలి కీలక నిర్ణయం

**దాతల ప్రివిలేజెస్‌లో మార్పులు**
**నేటి నుంచే అమల్లోకి వస్తాయని ప్రకటన**

**తిరుమల పెన్ పవర్ జూలై 15 :** తిరుమల తిరుపతి దేవస్థానం మరో కీలక నిర్ణయం తీసుకుంది. టీటీడీలోని వివిధ ట్రస్టులు, పథకాలకు విరాళాలు అందించే దాతలకు కల్పించే ప్రివిలేజస్‌లో(విశేషాధికారాలు) పలు మార్పులు చేసింది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఈ విషయాన్ని వెల్లడించారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో టీటీడీ ఛైర్మన్ అధ్యక్షతన టీటీడీ పాలకమండలి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. విరాళాల నిర్వహణలో మరింత పారదర్శకత, ఏకరీతి తెచ్చేందుకు టీటీడీ ట్రస్టులు, పథకాలకు విరాళాలు ఇచ్చే దాతల ప్రివిలేజెస్‌లో మార్పులు చేసినట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఈ కొత్త నిబంధనలు ఈరోజు అర్ధరాత్రి నుంచి అమలులోకి వస్తాయని ప్రకటించారు. ఇప్పటికే విరాళాలు అందించిన దాతలకు ప్రస్తుతమున్న ప్రివిలేజెస్ అలాగే కొనసాగుతాయని వెల్లడించారు. అలాగే స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తుల కోసం తిరుమలలో రూ.6.31 కోట్లతో ఆళ్వార్ ట్యాంక్ సమీపంలో షెల్టర్లు, క్యూలైన్లు, మరుగుదొడ్లు నిర్మించనున్నామని.. దీనికి సంబంధించిన టెండర్లకు ఆమోదం తెలిపినట్లు బీఆర్ నాయుడు తెలిపారు. కుమారధార, పసుపుధార డ్యామ్‌లను మరింత పటిష్ట పరిచేలా డబుల్ లేన్ వంతెన నిర్మాణం కోసం రూ.2.77 కోట్లు మంజూరు చేస్తూ టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకుంది. తిరుమల ఎస్వీ మ్యూజియంలో 12 సంవత్సరాలు దాటిన వారికి రూ.50 ప్రవేశ రుసుము వసూలు చేయాలని నిర్ణయించారు. తిరుమలలోని ం దీ జ , ూా ం జ విశ్రాంతి భవనాల వద్ద పాత భవనాలను తొలగించి,నూతన భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. ఒంటిమిట్ట సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి మూలవర్లకు బంగారు కవచాల కోసం.. టీటీడీ ట్రెజరీలోని వేయి గ్రాముల బంగారాన్ని ఇచ్చేందుకు ఆమోదించారు. అలాగే ఆలయం వద్ద యాత్రికుల కోసం రూ.17.84 కోట్లతో..100 గదులతో విశ్రాంతి గృహం నిర్మాణానికి టెండర్లు ఆమోదించారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని పరామర్శించిన ప్రశాంతమ్మ



**కోవూరు పెన్ పవర్ జులై 15 :** కోవూరు నియోజకవర్గం ఇందుకూరుపేట మండలం నిడిముసిలి గ్రామానికి చెందిన మాజీ సర్పంచి దువ్వూరు పావని భర్త మధు రెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి బుధవారం ఆయనను పరామర్శించారు. మధు రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యుల సూచనల మేరకు చికిత్సను కొనసాగించాలని సూచించారు. ఆయన త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎలాంటి అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# పైప్‌లైన్ల కోసం తవ్విన సీసీ రోడ్లను వెంటనే పునర్నిర్మించాలి

## నిర్లక్ష్యం వహిస్తే కాంట్రాక్టర్లకు జరిమానాలు : జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా

**నరసరావుపేట, పెన్ పవర్, జూలై 15:** పల్నాడు జిల్లాలో జల జీవన్ మిషన్ (జేజేఎం) మరియు వాటర్ గ్రిడ్ పథకాల కింద పైప్‌లైన్లు వేసేందుకుగ్రామాలలోని సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రోడ్లను తవ్విన చోట, పనులు పూర్తయిన వెంటనే రోడ్ల పునర్నిర్మాణాన్ని చేపట్టాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను మరియు కాంట్రాక్టర్లను ఆదేశించారు.ప్రజా ప్రతినిధులు మరియు ప్రజల నుండి వస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని,పైప్‌లైన్ల టెస్టింగ్ మరియు కమిషనింగ్ పూర్తి కాగానే మొదటి ప్రాధాన్యతగా సీసీ రోడ్ల పునరుద్ధరణ జరగాలని స్పష్టం చేశారు.ఈ విషయంలో నిర్లక్ష్యం వహించి,ప్రజలకు ఇబ్బంది కలిగించే కాంట్రాక్టర్లపై జరిమానాలు విధించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని శంకరన్ వి.సి. హాల్ నందు కలెక్టర్ కృతిక శుక్లా అధ్యక్షతన "5వ జిల్లా నీటి మరియు పారిశుద్ధ్య మిషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో రూ. 240 కోట్ల అంచనా వ్యయంతో మంజూరైన మొత్తం 604 జేజేఎం పనుల పురోగతిని సమీక్షించారు.ఇందులో ఇప్పటికే 368 పనులు పూర్తి కాగా, ప్రస్తుతం ప్రగతిలో ఉన్న 231 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇంకా ప్రారంభం కాని 5 పనులను వెంటనే చేపట్టాలన్నారు. జేజేఎం పథకం కింద పెండింగ్ బిల్లులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ. 3,8.58 కోట్ల నిధులను విడుదల చేసిందని, కావున పనుల్లో మరింత వేగం పెంచాలని ఆదేశించారు.



**గ్రామ సభల ఆమోదం - ఇంటింటికీ తాగునీరు. :** జిల్లాలో మార్చి 2028 నాటికి ప్రతి గ్రామాన్ని "హర్ ఘర్ జల్" గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని కలెక్టర్ తెలిపారు.జేజేఎం 2.0 లో భాగంగా మిగిలిన గృహాలకు ఫంక్షనల్ హౌస్‌హోల్డ్ ట్యాప్ కనెక్షన్లు అందించేందుకు సిద్ధం చేసిన అన్ని ప్రతిపాదనలను గ్రామ పంచాయతీల పరిధిలోని 'గ్రామ నీటి మరియు పారిశుద్ధ్య కమిటీల ముందు ఉంచి, గ్రామసభల ద్వారా ఆమోదం పొందేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలోని మొత్తం 4,34,399 గ్రామీణ కుటుంబాలలో ఇప్పటికే 1,63,169 కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు అందించామని, మిగిలిన 2,71,230 కనెక్షన్లను జేజేఎం మరియు వాటర్ గ్రిడ్ ఫేజ్-1, ఫేజ్-2 ద్వారా సంతృప్త స్థాయిలో అందిస్తామని అధికారులు నివేదించారు.

**నీటి నాణ్యత పరీక్షలు - క్లోరినేషన్ :** జిల్లాలో తాగునీటి నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని రక్షిత మంచినీటి పథకాల పరిధిలో ఇన్‌లైన్ క్లోరినేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలన్నారు.అలాగే, వర్షాకాలానికి ముందు మరియు వర్షాకాలం తర్వాత తప్పనిసరిగా నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని, ఇందుకోసం ఫీల్డ్ టెస్ట్ కిట్ల కెమికల్స్ రీఏజెంట్లను అన్ని పంచాయతీలకు 2 రోజుల్లోగా డెలివరీ చేసి, 'సుజలాం యాప్' లో డేటాను నమోదు చేయాలని ఆదేశించారు.

**వేగవంతంగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ పనులు :** ఐపాలనాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ పురోగతిపై సమీక్షిస్తూ, అటవీ భూములు మరియు సామాజిక అటవీ ప్రాంతాలలో పైప్‌లైన్లు వేసేందుకు అవసరమైన అటవీ శాఖ అనుమతులు, డీజీపీఎస్ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ మేరకు ప్రతిపాదనలను అటవీ శాఖ ఉన్నతాధికారుల అనుమతులకై పంపినట్లు తెలిపారు. అలాగే జాతీయ రహదారుల పరిధిలో పైప్‌లైన్ క్రాసింగ్ అనుమతులను ఆయా పోర్టల్స్ ద్వారా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వాటర్ గ్రిడ్ కింద మంజూరైన నిర్మాణ పనులను వేగవంతం చేసి, ఈ ఏడాది డిసెంబర్ నాటికి కమిషనింగ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణప్రియ, ఆర్ అండ్ బీ ఎస్.ఈ. గీతా రాణి, జిల్లా గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ ఇంజనీరింగ్ అధికారి చంద్రశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్ఫ్లుయెన్సర్ల మాటలు నమ్మవద్దు

## పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు



**గుంటూరు, పెన్ పవర్, జులై, 15 :** గుంటూరు నగరంలో 'లెనిన్' మూవీ సక్సెస్ మీట్ పాసుల పేరుతో అభిమానుల గందరగోళం ఇన్ఫ్లుయెన్సర్ ప్రచారంతో థియేటర్ వద్ద భారీగా చేరుకున్న అభిమానులు గుంటూరు నగరంలో బుధవారం నిర్వహించనున్న 'లెనిన్' సినిమా సక్సెస్ మీట్‌కు సంబంధించిన పాసులు తన వద్ద ఉన్నాయని ఓ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ ప్రచారం చేయడంతో అక్కినేని అభిమానులు భారీ సంఖ్యలో థియేటర్ వద్దకు చేరుకున్నారు. పాసుల కోసం అభిమానులు, యువత థియేటర్ ప్రాంగణంలో గందరగోళం సృష్టించడంతో థియేటర్ యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పట్టాభిపురం పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. పోలీసుల రాకతో అభిమానులు, యువత అక్కడి నుంచి చెల్లాచెదురయ్యారు. ఈ సందర్భంగా పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల మాటలను నమ్మి ఇబ్బందులకు గురికావద్దని సూచించారు. అధికారికంగా ధృవీకరించని ప్రచారాలను విశ్వసించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పాసుల పేరుతో గందరగోళం సృష్టించిన ఇన్ఫ్లుయెన్సర్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి : ప్రత్తిపాటి

### ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు.. పొదుపు మహిళల స్పష్టమైన ముద్ర కనిపించాలి : ప్రత్తిపాటి
### బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జుల పనితీరు, నిబద్ధత సర్ కార్యాచరణలో స్పష్టంగా కనిపించాలి : ప్రత్తిపాటి





**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, జూలై 15:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, రాయితీ రుణాలను అర్హులైన యువత, స్వయం సహాయ సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన వారికి రుణాలు అందించని బ్యాంకులపై ప్రభుత్వ చర్యలుంటాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.17వ తేదీన నరసరావుపేటలో జరిగే క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని, నియోజకవర్గ టీడీపీ శ్రేణులు భారీసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రత్తిపాటి సూచించారు. బుధవారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో పట్టణ క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జులతో, చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల మండలాల క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జులతో స్థానిక అమరావతి రెసిడెన్సీ నందు వేర్వేరుగా సమావేశమయ్యారు. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్.. ముఖ్యమంత్రి చంద్రబాబుల నరసరావుపేట పర్యటన విజయవంతం.. జాతీయ ఓటర్ల సమగ్ర సర్వేపై (సర్) ప్రత్తిపాటి వారికి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఫోన్ ద్వారా మాట్లాడిన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు.. 17న నరసరావుపేటలో జరిగే ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి పర్యటనను విజయవంతంపై క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జులకు పలు సూచనలు చేశారు. అనంతరం క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జులతో ప్రత్యేకంగా సమావేశమైన ప్రత్తిపాటి, నరసరావుపేట సభా నిర్వహణ.. జనసమీకరణ.. 'సర్' నిర్వహణపై వారితో సమగ్రంగా చర్చించారు.

**డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి :** నియోజకవర్గంలోని మహిళా సంఘాల సభ్యులందరూ క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని ప్రత్తిపాటి క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జులకు సూచించారు. పొదుపు సంఘాల సభ్యులు కేంద్ర..రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకునేలా వారికి మార్గనిర్దేశం చేయాలన్నారు. డ్వాక్రా సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, వారు తయారుచేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్ అవకాశాలు అందిస్తున్నాయని ప్రత్తిపాటి చెప్పారు. సాధారణ పౌరులకు కూడా కేంద్ర ప్రభుత్వం అనేక బీమా పథకాలు ప్రవేశపెట్టిందని, వాటిపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎం.ఎస్.బీ.వై), ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎం.జే.జే.బీ.వై) వంటి పథకాలతో తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనాలు పొందవచ్చని ప్రత్తిపాటి సూచించారు.

**అర్హుల ఓటు.. ఒక్కటి కూడా పోవడానికి వీల్లేదు :** సర్ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జులు సంపూర్ణ అవగాహనతో ఉండాలని, అర్హుల ఓటు ఒక్కటి పోయినా అది కూటమి పార్టీలకే నష్టమని ప్రత్తిపాటి సూచించారు. నమోదు కాని అర్హుల ఓట్లకు బూత్ కన్వీనర్, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జులే బాధ్యులవుతారని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో నమోదైన అక్రమ ఓట్ల తొలగింపుపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. సెప్టెంబర్ లోపే పంచాయతీ ఎన్నికలు పూర్తి చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వ ముందని, దీనిపై త్వరలోనే స్పష్టత వస్తుందని ప్రత్తిపాటి పార్టీ శ్రేణులకు సూచించారు.

**పొదుపు సంఘాల మహిళలు, పార్టీ శ్రేణులు ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి : ఎంపీ లావు**

ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొనే క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాన్ని మహిళాసంఘాలు, పార్టీశ్రేణులు విజయవంతం చేయాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు పిలుపునిచ్చారు. బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జులతో ఫోన్లో మాట్లాడిన ఎంపీ, ప్రతి నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున పార్టీశ్రేణులు, పొదుపు సంఘాల మహిళలు తరలిరావాలని, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు జరిగే అన్ని కార్యక్రమాల్లో పాల్గొనాలని ఎంపీ సూచించారు. పొదుపు సంఘాల మహిళలు కొత్త రుణాలు, ఉపాధి అవకాశాలపై అవగాహన పెంచుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంపీ లావు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వార్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, ప్రధాన మద్దుమాల రవి, జాకోబు రాజు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, కోడె హనుమంతరావు, ఖుమీర్, కొత్త కోటేశ్వరరావు, బేరింగ్ మౌలాలి, గుంజి శ్రీనివాసరావు, ఇనగంటి జగదీష్, అమరా రమాదేవి, అంబటి సొంబాబు, షేక్ మస్తాన్ వలి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మురికి వాడలా రూపురేఖలు మారుస్తాం : ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, పెన్ పవర్,జులై,15, :** మురికి వాడల రూపురేఖలు మారుస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే నసీర్ స్థానిక 15వ డివిజన్ లో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్ వ్యవస్థ సక్రమంగా పనివచేస్తుందా ?లేదా ? అని ఆరా తీశారు. ప్రతిరోజు పొడి చెత్త, తడి చెత్త సేకరిస్తున్నారా అని స్థానికులు అడిగారు. అనంతరం డ్రైనేజీ వ్యవస్థ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గుంటూరు తూర్పు నియోజకవర్గం రూపురేఖలు మార్చేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ రెండేళ్ల కాలంలో పక్కా ప్రణాళికతో పనులు చేపట్టామని అన్నారు. గత వైసోపీ ప్రభుత్వంలో కనీసం నడవడానికి కూడా వీలులేని గుంతల రోడ్ల నుంచి ప్రజలకు విముక్తి కల్పించామని తెలిపారు. ప్రధాన రహదారుల్లో గుంతలు పూర్చడమే కాకుండా మారుమూల ప్రాంతాలకు కూడా సీసీ రోడ్లను నిర్మించామని చెప్పారు. ఇప్పటికే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 350 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. సుమారు 100 కోట్ల రూపాయలతో సీదీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపట్టామని అన్నారు. ప్రజలకు ఏ అవసరం ఉన్న తాము ముందుండి ధైర్యంగా నిలబడుతున్నామని చెప్పారు. నియోజకవర్గం లో మారుమూల ప్రాంతాలలో ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపరిచేందుకు విద్య, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు.

# గ్రామాలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్





**గుంటూరు, పెన్ పవర్,జూలై 15 :** రైతాంగానికి సమృద్ధిగా సాగునీరు, గ్రామాలకు సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను వేగవంతంగా అమలు చేస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.గుంటూరు ఛానల్ విస్తరణ, ఆధునికీకరణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, 2014లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో చేపట్టిన పట్టిసీమ ఎత్తిపోతల పథకం వల్ల కృష్ణా డెల్టా రైతులకు గత పదేళ్లుగా సాగునీటి భద్రత లభించిందన్నారు. రూ.1,300 కోట్లతో నిర్మించిన ఈ ప్రాజెక్టు రైతులకు వేల కోట్ల రూపాయల అదనపు వ్యవసాయ ఆదాయాన్ని అందించిందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతర సమీక్షలు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పర్యవేక్షణలో పోలవరం ప్రాజెక్టు పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని, ప్రాజెక్టు పూర్తయిన తర్వాత రాష్ట్ర వ్యవసాయ రంగానికి మరింత బలం చేకూరుతుందని ఆయన అన్నారు. గతంలో నిలిచిపోయిన గుంటూరు ఛానల్ విస్తరణ, ఆధునికీకరణ పనులను కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించిందని తెలిపారు. భూసేకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని, ఇప్పటికే రైతులకు పరిహారం చెల్లిస్తూ పనులను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.గుంటూరు ఛానల్ తొలి 47 కిలోమీటర్ల ఆధునికీకరణ పనులకు రూ.370 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ల ప్రక్రియ ప్రారంభమైందని, త్వరలోనే పనులు మొదలవుతాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత ప్రస్తుతం సాగులో ఉన్న 27 వేల ఎకరాలతో పాటు మరో 50 వేల ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని, మొత్తం సుమారు 75 వేల ఎకరాలు ప్రయోజనం పొందనున్నాయని మంత్రి వివరించారు. సాగునీటితో పాటు ఈ ప్రాంతంలోని అనేక గ్రామాలకు తాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని, రైతుల ఆదాయం పెరగడంతో పాటు వ్యవసాయ భూముల విలువ కూడా గణనీయంగా పెరుగుతుందని తెలిపారు.రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తూనే, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. రైతుల భవిష్యత్తు, గ్రామీణాభివృద్ధి, రాష్ట్ర ప్రగతిని దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న ఈ ప్రాజెక్టులకు ప్రజలందరూ సహకరించాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు.

# 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ వరం

## పర్చూరులో 'థ్యాంక్యూ సీఎం సార్' కార్యక్రమం



**మార్టూరు, పెన్ పవర్, జూలై 15 :** 2003 డీఎస్సీ ఉపాధ్యాయులను సీపీఎస్ నుంచి ఓపీఎస్‌లోకి మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి స్వాగతం పలుకుతూ పర్చూరు నియోజకవర్గంలో ఉపాధ్యాయులు 'థ్యాంక్యూ సీఎం సార్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11 వేల మంది 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు ఓపీఎస్ ప్రయోజనం పొందనున్నారని, ప్రభుత్వం ఇందుకోసం సుమారు రూ.30 వేల కోట్ల పెన్షన్ భారం భరిస్తోందని తెలిపారు. పర్చూరు నియోజకవర్గానికి చెందిన సుమారు 100 మంది ఉపాధ్యాయులకు రూ.300 కోట్ల మేర పెన్షన్ ప్రయోజనం లభించనున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయ నాయకుడు నూతలపాటి మార్కు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పాత పెన్షన్ హక్కు పునరుద్ధరణ చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపాధ్యాయుల భవిష్యత్‌కు భరోసా కల్పించారని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసుకుని ఆనందాన్ని పంచుకున్నారు. ప్రభుత్వ నిర్ణయం తమ కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పించిందని పేర్కొంటూ ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్, నాగేశ్వరరావు, వాసుదేవరావు, రత్నకుమార్, రఘు, శ్రీనివాసరావు, కండిమళ్ల రవికుమార్, సునీల్, ఈశ్వర్ ప్రసాద్, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సంజీవరెడ్డి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మార్టూరు ప్రభుత్వాసుపత్రిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కల నాటడం




**మార్టూరు, పెన్ పవర్,జూలై 15:** రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో "పర్యావరణమే పరిరక్షణ" కార్యక్రమంలో భాగంగా బుధవారం మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు కొర్రపాటి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి కాకోలు వెంకటేశ్వర్లు, మాజీ అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మ చౌదరి, ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జాస్తి సాంబశివరావు, సభ్యులు కాజా హుస్సేన్, తాళ్లూరి సాంబశివరావు, గోనుగుంట్ల రవికుమార్, షేక్ సైదా, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. జి. విష్ణు తేజతో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని వెల్లడించారు.

# కారంపూడి సచివాలయం 2 లో చోరీ

## విలువైన పత్రాలు, ఇంటి పన్ను రసీదు పుస్తకాలు ఎత్తుకెళ్లిన దుండగులు





**పెన్ పవర్ కారంపూడి జూలై 15 :** మండల కేంద్రమైన కారంపూడి పట్టణ సచివాలయం 2 లో చోరీ జరిగిందని సచివాలయం 2 కార్యదర్శి కోటేశ్వరరావు నాయక్ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. కార్యాలయంలో బీరువాలను పగలగొట్టిన దుండగులు ఎన్యూమరేషన్ ఫారాలు, ఇంటి పన్ను రసీదు పుస్తకాలను ఎత్తుకెళ్లినట్లు అయన తెలిపారు. కార్యాలయంలో విలువైన వస్తువులు, కంప్యూటర్లు ఉన్నప్పటికీ దుండగులు వాటి జోలికి పోకుండా పోలింగ్ బూత్ నెంబర్ 286, 289,292 కు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాలతో పాటు ఇంటి పన్ను పాత రసీదు పుస్తకాలు ఎత్తుకెళ్లడం పలు అనుమానాలకు దారి తీస్తుంది. సంఘటన జరిగిన ప్రాంతాన్ని కారంపూడి పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఎంపీడిఓ గంట. శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. జరిగిన సంఘటనను కార్యాలయ వాచ్ మెన్ తనకు ఫోన్ ద్వారా తెలియజేసారని దానితో వచ్చి చూసే సరికి బీరువా పగలగొట్టిఉందని సచివాలయం 2 కార్యదర్శి కోటేశ్వరరావు నాయక్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల గ్రీవెన్స్ నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి





**గుంటూరు, పెన్ పవర్, జులై, 15 :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి కార్యకర్తల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి పార్టీ నాయకులు, కార్యకర్తల నుండి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ నేతలు తమ సమస్యలు, ప్రజా అంశాలు, పార్టీ బలోపేతానికి సంబంధించిన సూచనలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పార్థివ దేహానికి ఆమంచి కృష్ణమోహన్ నివాళి



**చీరాల, పెన్ పవర్, జూలై 15:** మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతిపట్ల చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడిన గొప్ప నాయకుడిని రాష్ట్రం కోల్పోయిందని ఆయన పేర్కొన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలోని ముద్రగడ పద్మనాభం స్వగ్రామానికి వెళ్లిన ఆమంచి కృష్ణమోహన్, ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమంచి మాట్లాడుతూ, ముద్రగడ పద్మనాభం జీవితాంతం వెనుకబడిన వర్గాల హక్కులు, సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. ఆయన సేవలు, ఉద్యమ స్ఫూర్తి ఎప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమంచి కృష్ణమోహన్ అన్నారు.

## ప్రత్తిపాటి సమక్షంలో టీడీపీ గూటికి చేరిన వైసీపీ కార్యకర్తలు

**మురికిపూడికి చెందిన 30 మంది చెంబేటి కుటుంబ సభ్యులు 20 వైసీపీ కుటుంబాలను సాదరంగా టీడీపీలోకి స్వాగతించిన ప్రత్తిపాటి**



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, జూలై 15:** చిలకలూరిపేట: మండలంలోని మండలం మురికిపూడికి చెందిన వైసీపీ సానుభూతిపరులైన 20 కుటుంబాలకు చెందిన వడ్డెరలు, చెంబేటి కుటుంబసభ్యులైన మరో 30 మంది బుధవారం ప్రత్తిపాటి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రత్తిపాటిని ఆయన నివాసంలో కలిసిన వైసీపీ కార్యకర్తలు... ఆ పార్టీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, అధినేత జగన్ దిగజారుడు రాజకీయాలు, నేరస్వభావ మనస్తత్వాన్ని భరించలేకే తాము టీడీపీలో చేరడానికి సిద్ధమైనట్టు తెలిపారు. వారి కోరికను మన్నించిన ప్రత్తిపాటి, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి చంబేటి వెంకటేశ్వర్లు, శ్రీను, పెద్ద వెంకటేశ్వర్లు, వేముల సుబ్బాయమ్మ, గుంజి పేరయ్య, వెంకటేశ్వర్లు, బత్తుల ఏసుదానమ్మ, మిగిలిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా తెలుగుదేశంలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వార్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, టీడీపీ నాయకులు గుంజి శ్రీనివాసరావు, చిగురుపాటి రాజా బాబు, కొమ్మనబోయిన రామారావు, సిద్దయ్య, ఉయ్యాల గోవిందు, కుంభా సుబ్బారావు, పఠాన్ సైదా, షేక్ బాజీ, గ్రామ నాయకులు, టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ చీఫ్ జగన్‌ది రాక్షక మనస్తత్వం

**ఏపి మంత్రి రామానాయుడు ఫైర్**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌పై ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. జగన్‌ది రాక్షస మనస్తత్వమని ధ్వజమెత్తారు. కరవు కాటకాలతో రాష్ట్రం అల్లాడిపోవాలనే ఆలోచన ఆయనకున్నదని విమర్శించారు. రైతు ద్రోహి జగన్ అని, అలాంటి వ్యక్తికి ఒక పార్టీ అధ్యక్షుడిగా ఉండే అర్హత కూడా లేదని మండిపడ్డారు. ఎల్‌నినో కారణంగా ఏపీలో ఎక్కడా ఒక్క చుక్క నీరు కూడా లేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తంచేశారు.

## పేద విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించిన ప్రత్తిపాటి



**చిలకలూరిపేట, పెన్ పవర్, జూలై 15:** కూటమి ప్రభుత్వం సుదీర్ఘకాలం అధికారంలో ఉంటేనే ఆంధ్రప్రదేశ్ దేశం గర్వించేలా అభివృద్ధి చెందుతుందని, అప్పుడే ప్రజలకు ఎనలేని మేలు జరుగుతుందని మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారు తెలిపారు. శ్రీ కృష్ణదేవరాయ విద్యాభివృద్ధి కమిటీ, ఆంధ్రప్రదేవ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని జంపని కళ్యాణమండపం నందు నిర్వహించిన కాపు, తెలగ, బలిజ, తూర్పుకాపు వర్గాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం, పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో ప్రత్తిపాటి మాట్లాడారు. కూటమిపార్టీల కలయిక రాష్ట్ర ప్రజలకు స్వేచ్ఛా సంతోషాలు తీసుకొచ్చిందన్న ప్రత్తిపాటి, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పినట్టు ఐక్యతే మనందరి బలమని, ఆయనలానే మిగతా నాయకులు కూడా విశాలదృక్పథంతో ఆలోచించాలని ప్రత్తిపాటి సూచించారు. గత ప్రభుత్వం ప్రజలు.. నాయకులతో పాటు, సామాజికవేత్తలు. స్వచ్ఛందసంస్థల నిర్వాహకుల్ని కూడా తీవ్రంగా ఇబ్బందిపెట్టిందని ప్రత్తిపాటి చెప్పారు. తమ వర్గాల్లోని పేద విద్యార్థుల్ని ప్రోత్సహిస్తూ, వారికి అండగా నిలుస్తున్న శ్రీ కృష్ణదేవరాయ విద్యాభివృద్ధి కమిటీ, ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు, సభ్యుల్ని ప్రత్యక్షంగా అభినందిస్తున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు. పదోతరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన 30మంది పేద విద్యార్థులకు నూతన వస్త్రాలు, నగదు పురస్కారాలు అందించి ఉన్నత చదువుల దిశగా వారిని ప్రోత్సహించడం మంచి నిర్ణయమని ప్రత్తిపాటి కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిడిఎంఎస్ చైర్మన్ వడ్రణం హరిబాబు, తోట రాజారమేష్, పఠాన్ సమద్, మద్దుమాల రవి, తోట శరత్ చంద్ర, సిఐ రమేష్, మండలనేని చరణ్ తేజ, మాజీ మునిసిపల్ చైర్మన్ షేక్ రఫ్ఫాని, షేక్ మస్తాన్ వలి, తోట బ్రహ్మస్వాములు, తోట సత్యం, మిరియాల లక్ష్మీ నారాయణ, ఇమ్మడి జానకిధర్, మిరియాల రత్న కుమారి, తదితరులు పాల్గొన్నారు...

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం.. జాప్యాన్ని సహించబోను : ప్రత్తిపాటి

**మౌలిక వసతులు.. భూ సమస్యలు..విద్య, వైద్యం..ఉపాధి కల్పన సమస్యల్ని వేగంగా పరిష్కరించాలి.**

**ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి**



**కొందరి నిర్లక్ష్యం..జాప్యం వల్ల మొత్తం వ్యవస్థలకే చెడ్డపేరు**

**చిలకలూరిపేట, పెన్ పవర్, జూలై 15:** మౌలిక వసతుల కల్పన, రైతుల భూ సమస్యలు, విద్యా..వైద్యం, ఉద్యోగ, ఉపాధి కల్పన సమస్యల అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని, జాప్యాన్ని సహించబోనని, సకాలంలో అర్జీదారులకు న్యాయం చేయాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అధికారుల్ని ఆదేశించారు. బుధవారం ఆయన తన నివాసంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించి, ప్రజల నుంచి పలు సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. వాటిని పరిశీలించిన ఆయన.. సంబంధిత ప్రభుత్వ అధికారులు, సిబ్బందితో మాట్లాడి, అర్జీదారులకు వీలైనంత త్వరగా న్యాయం చేయాలని ఆదేశించారు. : యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన.. ప్రజారోగ్యం.. విద్యా సమస్యలు.. సామాజిక న్యాయం.. మౌలిక వసతుల కల్పన వంటి సమస్యల్ని వేగంగా పరిష్కరించాలని, ప్రధానంగా రైతులు ఎదుర్కొనే భూ వివాదాలు, సమస్యలపై రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రత్తిపాటి ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో కొందరు చూపే నిర్లక్ష్యం. చేసేజాప్యం.. మొత్తం వ్యవస్థలకే చెడ్డపేరు తీసుకువస్తోందని, ఈ పద్ధతికి తక్షణమే స్వస్తి చెప్పాలని ప్రత్తిపాటి తేల్చిచెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తప్పకుండా సామాజిక పింఛన్లు అందిస్తుందని, కొత్త పింఛన్లపై త్వరలోనే అర్హులకు తీపి కబురు అందుతుందని ఈ సందర్భంగా ప్రత్తిపాటి ప్రజలకు భరోసా ఇచ్చారు.

## ఎడ్లపాడులో 'పొలం పిలుస్తుంది'

**సాగు మెళకువలపై రైతులకు దిశానిర్దేశం**



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, జూలై 15 : ఎడ్లపాడు :** ఏపీ ప్రభుత్వం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఎడ్లపాడు-1 రైతు సేవా కేంద్రంలో బుధవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఏ.హరిప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి మంగళ, బుధవారాల్లో రెండు గ్రామాల చొప్పున క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

**పంటల సాగులో జాగ్రత్తలు :** ప్రస్తుతం 'ఎలినో' పరిస్థితుల దృష్ట్యా పంటలయాజమాన్యంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. పత్తిలో గులాబీ రంగు పురుగుల నివారణకు ఎకరానికి 20 చొప్పున పసుపు, నీలం జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని, పంట చుట్టూ రక్షక పంటలుగా జొన్న, సజ్జలు వేయాలని సూచించారు. కంది, మినుముల్లో రసం పీల్చే పురుగుల నివారణకు, బెట్ట పరిస్థితుల్లో పొటాషియం నైట్రేట్ (5 గ్రాములు) లేదా యూరియా (20 గ్రాములు) లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వరికి బదులు తక్కువ కాలంలో పండే చిరుధాన్యాలను ఎంచుకోవాలని కోరారు.

**ప్రభుత్వ సేవలు - భీమా సౌకర్యం :** కౌలు రైతులు తప్పనిసరిగా సిసిఆర్సి కార్డులు పొందాలని, వీటిపై సహకార బ్యాంకుల ద్వారా రూ. లక్ష వరకు రుణాలు పొందవచ్చని వివరించారు. 'ఏపిఏఐఎంఎస్' యాప్ ద్వారానే యూరియా, డిఏపి ఎరువులను పంపిణీ చేస్తామని, రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని స్పష్టం చేశారు.

**పంట భీమా :** వాతావరణ ఆధారిత పంట భీమా పథకం కింద పత్తి రైతులు ఎకరానికి రూ. 1,900 ప్రీమియం చెల్లించి జూలై 31లోపు భీమా చేయించుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ ఏ. సుబ్బారావు సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ పి. రామ్మోహన్‌రావు, ఏఈవో జీవన్, రైతు సేవా కేంద్రం సిబ్బంది బిలాల్, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

**రుణమేళా నేపథ్యంలో ఏఎస్ఎల్ నిర్వహించిన కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ బి. ఉమామహేశ్వర్**



**నరసరావుపేట, పెన్ పవర్, జూలై 15 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జూలై 17న పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించనున్న రుణమేళా కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ బి. ఉమామహేశ్వర్ బుధవారం అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) నిర్వహించి కార్యక్రమానికి సంబంధించిన భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇస్సపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, సమావేశం జరగనున్న కోడెల శివప్రసాదరావు స్టేడియం, వీఐపీ, ప్రజల వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, ముఖ్యమంత్రి కాన్వాయ్ ప్రయాణ మార్గాలను అధికారులు తనిఖీ చేశారు. భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పకడ్బందీ బందోబస్తు నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ బి. ఉమామహేశ్వర్ పోలీసు అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమ భద్రత కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా కార్యక్రమ ప్రాంగణం, హెలిప్యాడ్, కాన్వాయ్ మార్గాలను నిరంతరం పర్యవేక్షించనున్నట్లు వెల్లడించారు. ఏఎస్ఎల్ కార్యక్రమంలో పోలీసు శాఖ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎస్ఎస్‌జీ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్చూరు టీడీపీ మండల సమావేశం

**స్థానిక సమస్యల పరిష్కారానికి కార్యాచరణ - అభివృద్ధి పనులపై సమీక్ష**



**పర్చూరు, పెన్ పవర్, జూలై 15: :** పర్చూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు, ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ శంషుద్దీన్ అధ్యక్షతన మండల పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న స్థానిక సమస్యలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, కొనసాగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన కొత్త అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామాల వారీగా సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నాయకత్వంలో పర్చూరు మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ, గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల పార్టీ సెక్రటరీ కొరిటాల సురేష్, ఫ్యాక్టరీ శీను, హుస్సేన్, గోరంట్ల రామకృష్ణ, కాపు రవిచంద్, కొండగంటి శివ, శ్రీరామ్ సుబ్బారావు, చింపయ్య, మామిడిపాక హరి, మల్లాది సురేష్, లక్కపోగు సుమన్, షేక్ బాబు, దాసి కిరణ్, మల్ల శీను, గౌస్, సమీర్, సైదా, మహాభాష, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కాపు ఉద్యమనేత ముద్రగడ. పద్మనాభం మృతి కాపులకు తీరనిలోటు

**సంతాపసభలో పాల్గొన్న కాపు నాయకుడు వైసిపి కారంపూడి పట్టణ అధ్యక్షుడు బొమ్మిన. అల్లయ్య**



**పెన్ పవర్ కారంపూడి వెంకటేష్ పెనుగొండ్ల జూలై 15 :** కాపు ఉద్యమనేత ముద్రగడ. పద్మనాభం మరణం కాపులకు ఆంధ్రరాష్ట్ర ప్రజలకు తీరనిలోటు అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కారంపూడి పట్టణ అధ్యక్షులు, కాపు సంఘం నాయకులు బొమ్మిన. అల్లయ్య అన్నారు. బుధవారం కారంపూడి బస్ స్టాండ్ సెంటర్ లోని వంగవీటి. మోహనరంగా విగ్రహం వద్ద కాపు సంఘం మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముద్రగడ. పద్మనాభం సంతాపసభ జరిగింది. ఈ సందర్భంగా ముద్రగడ. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాపు సమాజం కోసం అయన సాగించిన ఉద్యమం ప్రజాసమస్యల పై చూపిన అంకితభావం. జీవితాంతం వెనుకబడిన వర్గాల హక్కులు సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు ఆయన సేవలు ఉద్యమ స్ఫూర్తి ఎప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వెళ్ళడం ప్రతి ఒక్కరు బాధ్యత అని అన్నారు. చేసిన మంచి ఎప్పటికి గుర్తుండిపోతాయని ముద్రగడ. పద్మనాభం ఆత్మకు శాంతిచేకూర్చాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్లు అలాగే వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు వైసిపి కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## జూలై 17ను హక్కుల పోరాట దినంగా జరుపుకుందాం

**డీబీఎఫ్ జాతీయ అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్**





**చీరాల, పెన్ పవర్, జూలై 15 :** కారంచేడు మారణకాండ జరిగి 41 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా జూలై 17ను హక్కుల పోరాట దినంగా జరుపుకోవాలని డీబీఎఫ్ జాతీయ అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం చీరాలలోని దళిత మహాసభ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశంలో 1985కు ముందు దళితులపై అనేక దాడులు జరిగినప్పటికీ, కారంచేడు ఘటన దేశ రాజకీయ, సామాజిక పరిస్థితులపై గణనీయమైన ప్రభావం చూపిందని ఆయన పేర్కొన్నారు. ఈ ఉద్యమం దళితుల హక్కుల పరిరక్షణకు చట్టాలు, ప్రత్యేక హక్కుల సాధనకు దోహదపడిందని అన్నారు. అలాగే, కుల వివక్షను నిరాకరించిన రాజకీయ, సామాజిక వర్గాలు కూడా కుల నిర్మూలన కోసం ప్రత్యేక పోరాట సమితులు ఏర్పాటు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను దేశవ్యాప్తంగా చాటిచెప్పిన దళిత ఆత్మగౌరవ ఉద్యమంగా కారంచేడు పోరాటాన్ని ఆయన అభివర్ణించారు. కారంచేడు, చుండూరు ఉద్యమాల ఫలితంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం వంటి కీలక చట్టాలు అమల్లోకి వచ్చాయని, అయితే ప్రస్తుతం వాటి అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం, సంక్షేమ పథకాలు, రిజర్వేషన్ల అమలులో లోపాలు ఉన్నాయని, దళితులకు చెందాల్సిన హక్కులు నిర్వీర్యం అవుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో దళితులు, బహుజన సంఘాలు తిరిగి ఐక్యమై తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రం, డీబీఎఫ్ రాష్ట్ర నాయకుడు మేళం భాగ్యరావు, దళిత మహాసభ నాయకుడు మాచవరపు జూలియన్ తదితరులు పాల్గొన్నారు.

## నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు గట్టి కౌన్సిలింగ్ చేస్తున్న గుంటూరు పోలీసులు



**గుంటూరు, పెన్ పవర్, జులై, 15 :** గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ రోజు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు మరియు చెడు నడత కలిగిన వారికి పోలీసు అధికారులు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి పూర్తిగా స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల ఒక రౌడీ షీటర్‌పై పీడీ యాక్ట్ అమలు చేసి రాజమండ్రి జైలుకు పంపించగా, బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన రౌడీ షీటర్లకు ను మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వద్ద హాజరు పరిచి తగిన ఆదేశాలు తీసుకోవడం జరుగుతుంది. రౌడీ షీటర్లు మరియు నేరప్రవృత్తి కలిగిన వ్యక్తులపై జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతోందని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

## కొండవీడు కోట దర్గా ఉత్సవం.



**చిలకలూరిపేట రూరల్ , కొండవీడు పెన్ పవర్, జూలై 15::** కోటపై దాదాపు 700 సంవత్సరాల చరిత్ర కలిగిన సూఫీ సద్గురువు హజరత్ సూఫీ సయ్యద్ షాహ్ మహాత్ముల వారి దర్గా మహోత్సవం 26న జులై 2026, ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని, ఈ పవిత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొనాలని మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ని, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. అనంతరం ఊరుసు కు సంబంధించిన పోస్టరును మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆవిష్కరించారు.

# ఆయుష్ వైద్యానికి హబ్‌గా ఏపీ

## రూ.414 కోట్లతో భారీ అభివృద్ధి పనులు ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్




**విజయవాడ,పెన్ పవర్,జూలై 15 :** ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆయుష్ వైద్యానికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.414 కోట్ల వ్యయంతో భారీ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన "ఔషధ మొక్కల స్థిరమైన సాగు -- ఆర్థిక వృద్ధి -- మార్కెటింగ్ మౌలిక సదుపాయాలు" అంశంపై రాష్ట్ర సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఆయుర్వేదం, యునాని, సిద్ధ, యోగా, నేచురోపతి, హోమియోపతి వంటి ఆయుష్ వైద్య విధానాలకు మళ్లీ పునర్వైభవం తీసుకొస్తున్నామని తెలిపారు. రోగం వచ్చిన తర్వాత చికిత్స చేసే విధానానికి బదులుగా, రోగాలను ముందుగానే నివారించే ప్రివెంటివ్--వెల్‌నెస్ ఆధారిత ఆరోగ్య విధానం వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.

**నాలుగు కొత్త ఆయుష్ కళాశాలలు :** రూ.280 కోట్లతో ధర్మవరం, పిఠాపురంలో ఆయుర్వేద కళాశాలలు, ప్రొద్దుటూరులో యునాని కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నంలో నేచురోపతి మెడికల్ కళాశాల నిర్మాణం చివరి దశకు చేరుకుందని చెప్పారు.

**ఇంటిగ్రేటెడ్ ఆస్పత్రులు - డిస్పెన్సరీల ఆధునికీకరణ :** తిరుపతి, గిద్దలూరు, నందిగామ, తెనాలి, టెక్కలి, రంపచోడవరం ప్రాంతాల్లో సమగ్ర ఆయుష్ ఆస్పత్రులు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.44 కోట్లతో 1,500కు పైగా ఆయుష్ డిస్పెన్సరీల ఆధునికీకరణ పనులు తుది దశలో ఉన్నాయని తెలిపారు.

**ఔషధ మొక్కల సాగుకు ప్రోత్సాహం :** అశ్వగంధ, మునగ, ఉసిరి, అలోవెరా వంటి ఔషధ మొక్కలకు ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందని మంత్రి పేర్కొన్నారు. రైతులు ఔషధ మొక్కల సాగు ద్వారా అధిక ఆదాయం పొందేలా ప్రభుత్వం మార్కెటింగ్, సాంకేతిక సహకారం అందిస్తోందన్నారు. వ్యవసాయ, వైద్య శాఖల సమన్వయంతో ఈ రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. శాస్త్రీయ ప్రమాణాలతోనే ఆయుష్ ఉత్పత్తులు వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండ్యన్ మాట్లాడుతూ ఔషధ మొక్కల ఆధారిత ఉత్పత్తులు శాస్త్రీయ ప్రమాణాలు, నాణ్యత ధ్రువీకరణతో ప్రజలకు అందుబాటులోకి రావాలని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 30 నుంచి 35 వేల ఎకరాల్లో సాగవుతున్న ఔషధ మొక్కల విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**నకిలీ ఉత్పత్తులపై అప్రమత్తంగా ఉండాలి :** సెకండరీ హెల్త్ డైరెక్టర్ డా. కె.వి.ఎన్. చక్రధర బాబు మాట్లాడుతూ నేచురల్" పేరుతో విక్రయించే ఉత్పత్తుల విషయంలో ప్రజలు నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. సాంప్రదాయ వైద్య విధానాల ప్రాధాన్యాన్ని గ్రామీణ స్థాయి వరకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

**వెబ్‌సైట్, గ్రంథాల ఆవిష్కరణ :** సదస్సులో ఔషధ, సుగంధ మొక్కల ప్రోత్సాహానికి రూపొందించిన ప్రత్యేక వెబ్‌సైట్‌ను మంత్రి ప్రారంభించారు. ప్రపంచ రికార్డు గుర్తింపు పొందిన ఆయుర్వేద గ్రంథాలను ఆవిష్కరించి, రైతులకు ఔషధ మొక్కల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు, జిల్లా కలెక్టర్, వైద్య నిపుణులు, రైతులు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

# బీవీ అండ్ బీఎన్ గర్ల్స్ హైస్కూల్‌లో శక్తి యాప్, డ్రగ్స్, పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం





**చీరాల, పెన్ పవర్, జూలై 15 :** బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వరరావు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, చీరాల డీఎస్పీ మోయిన్ సూచనలతో చీరాల వన్‌టౌన్ సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో జాండ్రపేటలోని బీవీ అండ్ బీఎన్ గర్ల్స్ హైస్కూల్‌లో విద్యార్థినులకు శక్తి యాప్ వినియోగం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, "డ్రగ్స్ వద్దు బ్రో" ప్రచారం, పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎ. హరిబాబు, కానిస్టేబుల్ కె. సుబ్బారావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అత్యవసర పరిస్థితులు, వేధింపులు లేదా ప్రమాదాలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసుల సహాయం పొందేందుకు శక్తి యాప్ ఎంతో ఉపయోగ పడుతుందని వివరించారు. అలాగే "డ్రగ్స్ వద్దు బ్రో" ప్రచారంలో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్‌కు అలవాటు పడటం వల్ల చదువు, ఆరోగ్యం, భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటాయని హెచ్చరించారు. వేటపాలెం ప్రాంతంలో డ్రగ్స్ నియంత్రణకు మరింత కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోక్సో చట్టం నిబంధనలు, బాలికల హక్కులు, మహిళల భద్రతపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ టి రమాదేవి ఇంచార్జ్ హెచ్‌ఎం చిన్న పోతుల నాగమణి, జేవి నాగలక్ష్మి, శ్రీనివాసరావు, రాజకుమారి, కె వెంకటేశ్వర్లు, పి వెంకట్రావు సిబ్బంది పాల్గొన్నారు

# ప్రజాస్వామ్యంలో రాజకీయ వ్యవస్థ అత్యంత కీలకం

## సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు




**గుంటూరు: పెన్ పవర్, జులై, 15 :** ప్రజాస్వామ్యంలో ఉన్న సకల వ్యవస్థలలో రాజకీయ వ్యవస్థ అత్యంత కీలకమైన వ్యవస్థ అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. ఈ వ్యవస్థ బలహీనమైతే మిగిలిన వ్యవస్థల పనితీరుపై ప్రభావం పడి సమాజం అతలాకుతలం అవుతుందని స్పష్టం చేశారు. సీపీఐ గుంటూరు జిల్లా సమితి సభ్యులు, శాఖా కార్యదర్శులు, ప్రజా సంఘాల బాధ్యుల మూడు రోజుల రాజకీయ శిక్షణ తరగతులను గుంటూరు మల్లయ్య లింగం భవన్ లోని విస్ కె హాలులో బుధవారం ముప్పాళ్ళ ప్రారంభించారు. గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన శిక్షణ తరగతులలో ముప్పాళ్ళ ప్రారంభోపన్యాసం చేశారు. రాజకీయ వ్యవస్థ ప్రజాబంధువుగా, ప్రజా సంక్షేమాన్ని కాంక్షించేదిగా ఉండాలన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు మాత్రమే అధికారం చేపడతాయని, పార్టీల సిద్ధాంతాలు, ఆచరణలో పెట్టే నేతల తీరుపై పాలన ఆధారపడి ఉంటుందని చెప్పారు. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ అన్ని వ్యవస్థలను సక్రమంగా నడిపించాల్సి ఉంటుందని, ప్రతిపక్షంలో ఉ న్న పార్టీ అధికార పార్టీ పాలనలో ఉన్న లోపాలను ఎత్తిచూపించాల్సి ఉంటుందన్నారు. అధికార, ప్రతిపక్షాలు వారి బాధ్యతలు నిర్వర్తించడంలో విఫలమైతే వ్యవస్థలు సైతం విఫలమౌతాయని ముప్పాళ్ళ అన్నారు. రాజ్యాంగాన్ని అమలుపరిచే నాయకుని వ్యక్తిత్వంపై రాజ్యాంగ విలువలు ఆధారపడి ఉంటాయని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన మాటలను ఈ సందర్భంగా ముప్పాళ్ళ ఉదహరించారు. అందుకనే రాజకీయ పార్టీల నుంచి పాలకులను ఎన్నుకునే సమయంలో లోతైన విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉ ందని నొక్కిచెప్పారు. రాజకీయ వ్యవస్థ అనేది ఏ ఒక్క కులానికి, మతానికి సంబంధించింది కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాజకీయ విలువలు పతనమౌతున్నాయని, ప్రజల హక్కులు ఛిద్రమైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితులలో సోషలిజం సిద్ధాంతంపై నడిచే పార్టీగా... కార్మిక, కర్షక నేతృత్వంలో వ్యవస్థ సమగ్ర మార్పే లక్ష్యంగా పనిచేసే పార్టీగా భారత కమ్యూనిస్టు పార్టీ దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా అవతరించాల్సిన అవసరం ఉందని అన్నారు. పార్టీ నిర్మాణ సిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకుని ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని, స్థానిక సమస్యలపై అధ్యయనం చేస్తూ ప్రజలతో నిత్యం సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. సమిష్టి నిర్ణయాలతో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మార్క్సిజం అంటే ఏమిటి?' అనే అంశంపై బి. రామయ్య బోధించారు. మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని వివరించారు. భావవాదులు, భౌతికవాదుల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఉదాహరణలతో సహా తెలియజేశారు. తొలుత వక్తలను సీపీఐ గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య వేదికపైకి ఆహ్వానించారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఉత్తేజపూరితంగా గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమెన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,




**గుంటూరు, పెన్ పవర్, జులై, 15,** మహిళల భద్రతకు సంబంధించిన కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు, బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆదేశాలు గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ ఈరోజు గుంటూరు ఉమెన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కి సాయుధ గార్డు గార్డ్ ఆఫ్ ఆనర్ సమర్పించింది. అనంతరం పోలీస్ స్టేషన్ రిసెప్షన్, సీఐ-1, సీఐ-2 కౌన్సెలింగ్ గదులు, స్టేషన్ పరిసరాలు, స్టేషన్ భవనంపై ఉన్న ఎస్టీఎఫ్ కార్యాలయం, ఎస్టీఎఫ్ సిబ్బందికి కేటాయించిన డార్మిటరీలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందితో సమావేశమైన ఎస్పీ వారు ఎంతకాలంగా విధులు నిర్వహిస్తున్నారు, ప్రస్తుతం ఏ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు, విధుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో తెలుసుకుని, అవసరమైన సూచనలు చేశారు. మహిళలకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి, చట్టపరమైన చర్యలు ఆలస్యం లేకుండా చేపట్టాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన కేసుల్లో వెంటనే నమోదు చేసి, దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి, ఛార్జ్‌షీట్లు త్వరితగతిన దాఖలు చేయాలని ఆదేశించారు. స్టేషన్‌లో యూ.ఐ.లో ఉన్న పాత పెండింగ్ కేసులను ఒక్కొక్కటిగా సమీక్షించి, వాటిని ప్రాధాన్యత ఆధారంగా త్వరగా పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రైమ్ రికార్డులు, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, కేసు డైరీలు, స్టేషన్ రికార్డులు, మాల్ఖానా నిర్వహణ, విజిటర్ రిజిస్టర్, సీసీటీఎన్ఎస్ నమోదులు తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మహిళా బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి భరోసా కల్పించేలా మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, కుటుంబ వివాదాల పరిష్కారానికి కౌన్సెలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, చట్టపరమైన కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. బాధిత మహిళలకు సురక్షితమైన, స్నేహపూర్వక వాతావరణం కల్పించడం ప్రతి పోలీసు అధికారికి బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు.గుంటూరు టౌన్‌లో పనిచేస్తున్న శక్తి టీమ్స్-1, శక్తి టీమ్స్-2తో పాటు జిల్లాలోని అన్ని శక్తి టీమ్‌లకు లైజన్ అధికారిగా ఉన్న ఉమెన్ పోలీస్ డీఎస్పీ , శక్తి టీమ్‌లు మరింత సమర్థవంతంగా పనిచేసేలా పర్యవేక్షించాలని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ ఆదేశించారు. ఈ తనిఖీలో ఉమెన్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి , సీఐ అంజయ్య , సీఐ రమేష్ , ఎస్ బి సీఐ 1 మల్లికార్జున రావు ,ఎస్ఐ భవాని , ఎస్ఐ తరంగిణి స్టేషన్ రైటర్ యోహాన్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# చీరాలలో 42 మంది లబ్ధిదారులకు రూ.54.11 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ




**చీరాల, పెన్ పవర్, జూలై 15:** చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి (సియం ఆర్ ఎఫ్) నుంచి 42 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.54,11,473 విలువైన చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్య చికిత్స పొందలేని పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తోందని, అవసరమైతే ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితులు వైద్య ఖర్చుల రసీదులతో సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే పరిశీలన అనంతరం ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. చీరాల నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,032 మంది లబ్ధిదారులకు రూ.9.84 కోట్ల మేర ముఖ్యమంత్రి సహాయనిధి అందించబడిందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ సహాయానికి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు వైద్య భరోసా కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.దఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జగన్మోహన్ రెడ్డి 5 సంవత్సరాలు ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో మత్స్య కారులకు ఏమి చేశారు : జిల్లా అధ్యక్షులు గాదె.



**గుంటూరు, పెన్ పవర్, జులై, 15 :** మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అకాల మరణానికి చింతిస్తూ జనసేన పార్టీ నుంచి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది. శవం బయటకు వస్తే చాలు పరామర్శ పేరుతో బెంగుళూరు నుండి వస్తాడు జగన్మోహన్ రెడ్డి 5 సంవత్సరాలు ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో మత్స్య కారులకు మీరు ఏమి చేశారు మీ ప్రభుత్వం లో ప్రకృతి వైపరీత్యం వల్ల చనిపోయిన కుటుంబాలను పరమర్శించావా 217 జీవో తీసుకువస్తే మేము దాన్ని అడ్డుకొని మత్స్య కారులను అదుకున్నాం రాజధానికి భూములిచ్చిన మహిళా రైతులను పోలీసులతో కొట్టించావ్ మత్స్య కారులకు ఇన్సూరెన్స్ ఇస్తున్నాం మీ హయాంలో 275 మంది ప్రకృతి వైపరీత్యం వల్ల చనిపోతే ఎన్ని కోట్లు పరిహారం ఇచ్చావ్ శవాలను అడ్డం పెట్టుకొని పరామర్శ పేరుతో గొడవలు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు ఒక వ్యక్తిని బండితో గుద్ది చంపితే ఏదో పొరపాటున జరిగింది అని సపోర్ట్ చేసి మాట్లాడుతున్నారు మీ ప్రభుత్వం లో వ్యవస్థలను నాశనం చేశావ్ రాష్ట్రంలో ఉన్న పోలీసులు కూడా ఇప్పటికైనా మారాలి ప్రజల కోసం పోలీసులు పని చేయాలి పోలీస్ వ్యవస్థ సక్రమంగా ఉంటేనే రాష్ట్రంలో ప్రజలకు రక్షణ ఉంటుందిఒకరిద్దరు స్వార్థం కోసం లంచాలు తీసుకొని పని చేస్తే కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది తండ్రి చనిపోతే చూసే హక్కు కూతురికి ఉంటుంది సంప్రదాయం అంటే తెలియని వారు వైసీపీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శిఖా బాలు మిర్చి యార్డ్ డైరెక్టర్ నక్కల వంశీకృష్ణ జిల్లా కార్యదర్శి చట్టాల త్రినాథ్ నగర ఉపాధ్యక్షులు కొండూరు కిషోర్, తిరుమలశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

# ఖరీఫ్-2026 సీజన్‌కు అవసరమైన యూరియా, అన్ని రకాల ఎరువులు సమృద్ధిగా ఉన్నవి జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్, జులై, 15 :** జూలై నెలలో ఇప్పటికే 69 శాతం ఎరువుల విక్రయాలు పూర్తయ్యాయని, మిగిలిన అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, అవసరానికి మించి ఎరువులు కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని సూచించారు. ఎరువుల విక్రయాలు పూర్తిగా ఆపైమ్స్ యాప్ ద్వారానే జరుగుతున్నాయని, అధిక ధరలకు విక్రయించడం, బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, బలవంతపు ట్యాగింగ్ వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం జల హారతి--జల ధార కార్యక్రమంపై మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లాలో చేపట్టిన పనుల ద్వారా 0.69 టీఎంసీల అదనపు నీటి నిల్వ సామర్థ్యం పెరిగిందన్నారు. చెరువులు, కాలువలు, ఇతర నీటి వనరుల పునరుద్ధరణతో వర్షపు నీటి నిల్వ పెరిగి, భూగర్భ జలాల వృద్ధితో పాటు వ్యవసాయం, తాగునీటి అవసరాలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

# క్రీడాకారులకు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అభినందనలు

**విజయవాడ, పెన్ పవర్, జులై, 15 :** విశాఖపట్నంలో జూలై 4, 5 తేదీలలో నిర్వహించిన ఖేలో ఇండియా అస్మిత మహిళల లీగ్ -- సౌత్ జోన్ 2026 పోటీలలో ఆంధ్రప్రదేశ్, అస్సాం, అండమాన్ ఒ నికోబార్ దీవులు, కర్ణాటక, కేరళ, మణిపూర్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన మహిళా క్రీడాకారిణులు పాల్గొన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పోటీలలో పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 2 రజత పతకాలు, 7 కాంస్య పతకాలు సాధించి జిల్లా, రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకొచ్చింది. పతకాలు సాధించిన క్రీడాకారులను కలెక్టర్ లక్ష్మీశ బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యే క్రీడాకారిణులు మరింత ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి, జిల్లాకు మరిన్ని విజయాలు తీసుకురావాలన్నారు . మహిళలు క్రీడల్లో, ముఖ్యంగా వాటర్ స్పోర్ట్స్ క్రీడల్లో మరింతగా రాణించేలా శిక్షణ, ప్రోత్సాహం, అవసరమైన సహకారాన్ని అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ విజయానికి ఎన్టీఆర్ జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) కె. కోటేశ్వరరావు నాయకత్వం, కోచ్‌లు ఎం. శ్రీను, చందూరి తేజ అందించిన నాణ్యమైన శిక్షణ, నిరంతర మార్గదర్శకత్వం ప్రధాన కారణమయ్యాయి. వారి కృషి, అంకితభావం క్రీడాకారిణుల విజయానికి కీలకంగా నిలిచాయి. ఖేలో ఇండియా అస్మిత మహిళల లీగ్ పోటీలు ఉత్తర, దక్షిణ జోన్‌లలో నిర్వహించబడుతున్నాయి. ఈ జోనల్ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణులను ఆగస్టు 2026లో మధ్యప్రదేశ్‌లో నిర్వహించనున్న ఖేలో ఇండియా అస్మిత మహిళల లీగ్ జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ అధికారి డాక్టర్ కొల్లేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హైర్ బస్ డ్రైవర్ల సమ్మె ఉధృతం

**యాజమాన్యం నిర్లక్ష్యంపై కార్మికుల ఆగ్రహం**
**సీఐటీయూ, ఆశా వర్కర్ల సంఘీభావం**

**చీరాల, పెన్ పవర్, జూలై 15 :** తమ సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని బస్ యాజమాన్యం అమలు చేయకపోవడంతో చీరాల డిపో పరిధిలోని హైర్ బస్ డ్రైవర్లు బుధవారం నుంచి తిరిగి సమ్మెను ప్రారంభించారు. గత సోమవారం యాజమాన్యం విజ్ఞప్తి మేరకు తాత్కాలికంగా సమ్మెను విరమించిన డ్రైవర్లు, నిర్ణయించిన గడువు ముగిసినా ఎలాంటి పరిష్కారం లభించకపోవడంతో మళ్లీ ఆందోళన బాట పట్టారు. సమ్మెకు మద్దతుగా ఏపీఎస్‌ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి. తులసీరాం హాజరై కార్మికులకు సంఘీభావం తెలిపారు. అలాగే సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఎం. వసంతరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. బాబూరావు, మున్సిపాలిటీ సీఐటీయూ జిల్లా నాయకుడు జి. ఇమ్మానుయేల్, ఆశా వర్కర్స్ సీఐటీయూ నాయకురాలు వెంకటేశ్వరమ్మ తదితరులు ధర్నాలో పాల్గొని డ్రైవర్ల పోరాటానికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ, కార్మికుల సమస్యలను సామరస్యంగా పరిష్కరించాల్సిన ఆర్టీసీ డిపో మేనేజర్ ఆందోళన చేస్తున్న డ్రైవర్లతో చర్చలు జరపకుండా ఆవేశంగా స్పందించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. తమ ప్రధాన డిమాండ్లైన రోజువారీ వేతనాన్ని రూ.1,700కు పెంచడం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించడం, బోనస్, యూనిఫాం కుట్టుకూలీ చెల్లించడం, గతంలో తొలగించిన డ్రైవర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవడం వంటి అంశాలపై యాజమాన్యం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు సమ్మెను కొనసాగిస్తామని హైర్ బస్ డ్రైవర్లు స్పష్టం చేశారు. డ్రైవర్ల ఆందోళనతో చీరాల డిపో వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమస్యల పరిష్కారానికి అధికారులు, యాజమాన్యం చొరవ చూపాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

# వైసీపీలో మళ్లీ కీలకం కానున్న చెవిరెడ్డి

**తిరుపతి, జూలై 15 పెన్ పవర్:**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లో కీలక నేతల పాత్రపై మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. పార్టీ వ్యవహారాలను ఎవరు సమన్వయం చేస్తున్నారు, అధినేతకు అత్యంత సన్నిహితంగా ఎవరు వ్యవహరిస్తున్నారు అనే అంశాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గతంలో పార్టీలో "కోటరీ" వ్యవస్థ ఉందంటూ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి పలు సందర్భాల్లో వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలు అప్పట్లో రాజకీయంగా పెద్ద చర్చకు దారితీశాయి.ప్రస్తుతం వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా సజ్జల రామకృష్ణారెడ్డి వ్యవహరిస్తున్నారు. పార్టీ తరఫున విధానపరమైన ప్రకటనలు చేయడం, కీలక రాజకీయ అంశాలపై స్పందించడం, నాయకత్వ నిర్ణయాలను కేడర్‌కు చేరవేయడం వంటి బాధ్యతలను ఆయన నిర్వహిస్తూ వస్తున్నారు. అందుకే పార్టీ వ్యవహారాల్లో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారనే అభిప్రాయం
రాజకీయ వర్గాల్లో చాలాకాలంగా ఉంది.అయితే ఇటీవల మరో సీనియర్ నేత పేరు ఎక్కువగా వినిపిస్తోంది. తిరుపతి జిల్లా)కు చెందిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పార్టీ కేంద్ర కార్యాలయంలో చురుకుగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పార్టీ కార్యక్రమాల సమన్వయంలో ఆయన పాత్ర పెరిగిందనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.చంద్రగిరి ) నియోజకవర్గం నుంచి రెండుసార్లు
ఎమ్మెల్యేగా గెలిచిన చెవిరెడ్డి, 2024 ఎన్నికల సమయంలో తన కుమారుడు మోహిత్ రెడ్డి ని రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. అదే ఎన్నికల్లో ఆయన ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. అయితే ఎన్నికల్లో కూటమి ప్రభావంతో తండ్రీకొడుకులు ఇద్దరూ విజయం సాధించలేకపోయారు. తర్వాత లిక్కర్ కేసుకు సంబంధించి చెవిరెడ్డి అరెస్టై కొంతకాలం జైలులో ఉన్నారు. అనంతరం బెయిల్‌పై విడుదలైన తర్వాత ఆయన పార్టీ కార్యకలాపాల్లో మరింత చురుకుగా వ్యవహరిస్తున్నారని సమాచారం. ముఖ్యంగా తాడేపల్లి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎక్కువ సమయం గడుపుతున్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.పార్టీకి సంబంధించిన వివిధ జిల్లాల పరిస్థితులపై సమాచారం సేకరించడం, స్థానిక నాయకులతో సమన్వయం చేయడం, ఆ వివరాలను పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి
చేరవేయడం వంటి బాధ్యతల్లో చెవిరెడ్డి పాల్గొంటున్నారనే ప్రచారం కొనసాగుతోంది. అలాగే పార్టీ కార్యక్రమాలు సమర్థంగా అమలు అయ్యేలా పర్యవేక్షిస్తున్నారని కూడా పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఇటీవల కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన నిరసన కార్యక్రమాల నిర్వహణలో
కూడా చెవిరెడ్డి చురుకుగా వ్యవహరించారని ఆయన అనుచరులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాయకులతో నిరంతరం సంప్రదింపులు జరిపి కార్యక్రమాలను సమన్వయం చేశారని వారు పేర్కొంటున్నారు. ఈ కారణంగా ఆయనకు పార్టీ అధినాయకత్వం వద్ద మరింత ప్రాధాన్యం పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.మరోవైపు సజ్జల రామకృష్ణారెడ్డి ఇప్పటికీ పార్టీ విధానపరమైన అంశాల్లో కీలక
పాత్ర పోషిస్తూనే ఉన్నారని పరిశీలకులు గుర్తుచేస్తున్నారు. అధికారిక ప్రకటనలు, రాజకీయ స్పందనలు
ఎక్కువగా ఆయన ద్వారానే వెలువడుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సజ్జల, చెవిరెడ్డి ఇద్దరూ పార్టీ వ్యవహారాల్లో ముఖ్యమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారనే చర్చ కొనసాగుతోంది.
అయితే పార్టీలో వారి పాత్రలు ఎలా మారతాయి, భవిష్యత్‌లో బాధ్యతల పంపిణీలో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయనే అంశంపై అధికారికంగా ఎలాంటి ప్రకటన లేదు. దీంతో వైసీపీ అంతర్గత రాజకీయాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి కొనసాగుతోంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పట్టిసీమ వివాదంలోకి రేవంత్

**విజయవాడ జూలై16 పెన్ పవర్:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య జల రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే నీటిని నిల్వ చేయకుండా కిందకు వదిలేస్తోందని, తద్వారా ఏపీలోని పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి గోదావరి జలాలు సమృద్ధిగా అందేలా చూస్తోందని ప్రతిపక్ష బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన గురువు చంద్రబాబుకు మేలు చేసేందుకే తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెడుతున్నారన్నది ఈ విమర్శల సారాంశం. ఈ నేపథ్యంలో ఈ వాదనలోని సాంకేతిక, భౌగోళిక అంశాలపై ఆసక్తి నెలకొంది.తెలంగాణలోని కన్నెపల్లి మేడిగడ్డ పంప్ హౌస్ నుంచి ఎత్తిపోసే నీరు కిందకు రాకపోవడం వల్లే ఏపీలోని పట్టిసీమకు నీరు అందుతుందనే వాదన ప్రాథమిక భౌగోళిక సూత్రాలకే విరుద్ధం. మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రాణహిత, గోదావరి నదులు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద కలుస్తాయి. ఇక్కడే మేడిగడ్డ బ్యారేజీ ఉంది. మేడిగడ్డ దాటిన తర్వాత గోదావరి నది వందల కిలోమీటర్ల మేర ప్రవహించి, ఛత్తీస్‌గఢ్,ఒడిశా సరిహద్దుల నుంచి వచ్చే ఇంద్రావతి, శబరి వంటి భారీ ఉపనదులను కలుపుకుంటుంది. ఈ ఉపనదులన్నీ కలిసిన తర్వాతే గోదావరి నది ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం, ఆపై రాజమండ్రి ఎగువన ఉన్న పట్టిసీమ ప్రాంతానికి చేరుకుంటుంది.కాబట్టి మేడిగడ్డ వద్ద నీటిని ఆపినా, ఆపకపోయినా... వర్షాకాలంలో ఇంద్రావతి, శబరి, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో కురిసే భారీ వర్షాల కారణంగా వచ్చే వరద నీరు సహజ గ్రావిటీ ద్వారా పట్టిసీమకు చేరుకుంటుంది. జూలై మొదటి వారంలో మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు ప్రాణహిత ద్వారా మేడిగడ్డకు సుమారు 1 లక్ష క్యూసెక్కుల వరద రాగా, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిబంధనల ప్రకారం ఆ నీటిని కిందకు వదిలారు. అదే సమయంలో ఏపీలోని పట్టిసీమ వద్ద గోదావరిలోకి వచ్చిన 56,000 క్యూసెక్కుల వరద జలాల నుంచే జూలై 8న ఏపీ ప్రభుత్వం కృష్ణా డెల్టాకు నీటిని లిఫ్ట్ చేయడం ప్రారంభించింది.కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కారణాలతోనే మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. అయితే దీనికి అనేక సాంకేతిక కారణాలున్నాయి. అక్టోబర్ 2023లో మేడిగడ్డ బ్యారేజ్ 7వ బ్లాక్‌లోని కొన్ని పిల్లర్లు కుంగిపోయాయి. దీనిపై విచారణ జరిపిన చీఫ్‌ఈూా బ్యారేజీ పునాదుల కింద ఇసుక కొట్టుకుపోవడం, జియో-టెక్నికల్ సర్వేల్లో లోపాలు ఉన్నట్లు తేల్చింది. ప్రస్తుత స్థితిలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో పూర్తి స్థాయిలో అంటే 141 మీటర్ల మేర నీటిని నిల్వ చేయడం అత్యంత ప్రమాదకరమని, బ్యారేజీలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని చీఫ్‌ఈూా స్పష్టం చేసింది. ఈ మూడు బ్యారేజీల శాశ్వత పునరుద్ధరణ పనులు పూర్తి కావడానికి కనీసం 2 నుండి 3 ఏళ్ల సమయం పడుతుందని అంచనా. నదిలో ప్రవాహం లేని ఎండకాలంలో మాత్రమే కాంక్రీట్ పనులు చేయడం సాధ్యమవుతుంది. ప్రభుత్వం ప్రాజెక్టు భద్రతను దృష్టిలో ఉంచుకుని నిపుణుల కమిటీ సూచనల మేరకే గేట్లు ఎత్తి నీటిని కిందకు పంపుతోంది తప్ప, పట్టిసీమకు నీరివ్వాలనే ఉద్దేశంతో కాదు. ఒకవేళ బలవంతంగా నీటిని నిల్వ చేస్తే రూ. 1.1 లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ఆస్తులకే ముప్పు వాటిల్లుతుంది.రాజకీయ విమర్శల కోణంలో చూస్తే రేవంత్ రెడ్డి ఏపీకి మేలు చేస్తున్నారనే ఆరోపణలు ప్రజల్లోకి వెళ్ళవచ్చు. కానీ, క్షేత్రస్థాయి పరిశీలన, సాంకేతిక నివేదికల ప్రకారం మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయకపోవడానికి ప్రధాన కారణం ఆ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన సాంకేతిక లోపాలు, భద్రతా కారణాలే. భౌగోళికంగా మేడిగడ్డకు వందల కిలోమీటర్ల దిగువన ఉండే పట్టిసీమకు నీరు అందడం అనేది గోదావరి నది సహజ ప్రవాహం, ఇతర ఉపనదుల వరద మీద ఆధారపడి ఉంటుంది తప్ప, మేడిగడ్డ గేట్లు వేయడం లేదా ఎత్తడం పై మాత్రమే ఆధారపడి లేదు.

## నవంబర్ లో లోకల్ బాడీ ఎన్నికలు

**విజయవాడ, జూలై 16, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైంది. రాబోయే నవంబర్ నాటికి లోకల్ పోల్స్ ముగించాలనే పక్కా ప్లాన్‌తో అధికార కూటమి అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇద్దరూ ఇప్పటికే తమ పార్టీల శ్రేణులకు ఈ విషయంలో స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. చట్టపరమైన, సాంకేతికపరమైన ప్రక్రియ పూర్తి కాగానేస్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, దానికి సైనికుల్లా సిద్ధం కావాలని క్షేత్రస్థాయి క్యాడర్‌ను అలర్ట్ చేశారు. ఎన్నికల ప్రకటన వచ్చిన తర్వాత సీట్ల కోసం కొట్టుకోకుండా, ముందే గ్రౌండ్ లెవెల్‌లోఒక అవగాహనకు అంతర్గతంగా వచ్చేస్తున్నారు. గత ఎన్నికల్లో జనసేన పార్టీ వంద శాతం స్ట్రైక్ రేట్‌తో దూసుకుపోవడానికి ప్రధాన కారణం పార్టీ కోసం రక్తం చిందించిన క్షేత్రస్థాయి కార్యకర్తలే. అందుకే ఈసారిస్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కల్యాణ్ గట్టిగా నిశ్చయించుకున్నారు. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ అరాచకాలను ఎదుర్కొని, పార్టీ జెండా మోసిన నిజమైన లాయల్ కార్యకర్తలపూర్తి సమాచారాన్ని, వారి అర్హతలను జనసేన అధిష్ఠానం ఇప్పటికే సేకరించింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక పైరవీలు చేసేవారికి కాకుండా, కష్టపడ్డవారికే టికెట్లు దక్కుతాయి అనే నమ్మకాన్ని పవన్‌కిందిస్థాయి క్యాడర్‌లో నింపారు. దీనివల్ల ఆశావహుల్లో గందరగోళం తగ్గి, పార్టీ కోసం మరింత ఉత్సాహంగా పనిచేసే వాతావరణం ఏర్పడింది.మరోవైపు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థలఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇటీవల కుప్పం, కర్నూలు తదితర ప్రాంతాల సమీక్షా సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. లోకల్ పోల్స్‌లో విజయం సాధించడం నాన్-నెగోషియబుల్‌అని తేల్చిచెప్పారు. స్థానిక ఎన్నికల్లో గెలిపించిన నేతలనే పార్టీ నెత్తిన పెట్టుకుంటుందని, ఓడిపోయిన వారిని ఎంతటి వారైనా పక్కన పెడుతుందని కఠినమైన హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగాతంబళ్లపల్లె వంటి నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌ల నియామకం, గ్రౌండ్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే సీట్ల కేటాయింపు ఉంటుందని లోకేష్, బాబు స్పష్టం చేయడంతో తమ్ముళ్లలో మునుపెన్నడూ లేనిసీరియస్‌నెస్ కనిపిస్తోంది.సాధారణంగా స్థానిక ఎన్నికలు అనగానే అధికార పార్టీల్లో టికెట్ల కోసం అంతర్గత కుమ్ములాటలు, తిరుగుబాట్లు కామన్. పైగా ఇక్కడ టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా పోటీచేస్తున్నాయి. ఒకే స్థానానికి ముగ్గురు అభ్యర్థులు పోటీ పడితే ఓట్లు చీలిపోయే ప్రమాదం ఉంది. ఈ ముప్పును ముందే పసిగట్టిన బాబు-పవన్ ద్వయం.. క్షేత్రస్థాయిలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా
సీట్ల సర్దుబాటు ఫార్ములాను ముందే సిద్ధం చేస్తున్నారు. ఏయే గ్రామ పంచాయతీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో ఏ పార్టీ బలంగా ఉందో ఆ పార్టీకే ఆ సీటు కేటాయించేలా.. జిల్లా స్థాయి మంత్రులు,
ఇన్‌చార్జ్‌ల పర్యవేక్షణలో ముందస్తు స్క్రీనింగ్ కమిటీలు వేస్తున్నారు.సార్వత్రిక ఎన్నికల తరహాలోనే స్థానిక ఎన్నికల్లోనూ 2024 నాటి కూటమి పొత్తు సెంటిమెంట్‌ను అలాగే కొనసాగించాలని
అధినాయకత్వం భావిస్తోంది. పైస్థాయిలో నేతలు కలిసి ఉన్నా, కిందిస్థాయిలో గ్రామాల్లో టీడీపీ-జనసేన క్యాడర్ కలవడం చాలా ముఖ్యం. అందుకోసమే ఉమ్మడి సమన్వయ కమిటీల ద్వారా ఇరు పార్టీల
కార్యకర్తలను ఒకే తాటిపైకి తెస్తున్నారు. ఈ ముందస్తు సన్నాహాల వల్ల ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే సమయానికి కూటమి తరఫున అభ్యర్థులు దాదాపు ఖరారై ప్రచారంలో ఉంటారు. ఇది ప్రతిపక్ష
వైఎస్సార్‌సీపీని మానసికంగా మరింత డిఫెన్స్‌లోకి నెట్టేసే వ్యూహం.ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ వరుస పరాజయాలు, అంతర్గత వలసలతో డీలా పడి ఉంది. ఈ తరుణంలో నవంబర్ లోకల్ బాడీ ఎన్నికల్లో కూడాకూటమి క్లీన్ స్వీప్ చేస్తే.. విపక్షం పుంజుకునే అవకాశాలు పూర్తిగా మూసుకుపోతాయి. అందుకే చంద్రబాబు కమాండర్‌లా తానే ముందుండి నడిపిస్తానని భరోసా ఇస్తుండగా, పవన్ కల్యాణ్ పంచాయతీ రాజ్‌శాఖ మంత్రిగా గ్రామీణ ఓటర్లను ఆకట్టుకునేలా సరికొత్త అభివృద్ధి సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత, ముందస్తు ప్రణాళిక, క్యాడర్‌కు స్పష్టమైన గైడ్‌లైన్స్.. ఇవే నవంబర్
సమరంలో కూటమికి శ్రీరామరక్ష కానున్నాయి.

# కూటమి ఎమ్మెల్యేలే టార్గెట్ గా రావణ్ టీమ్



**అనంతపురం, జూలై 15 పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపుతున్న 'ప్రశ్న' యూట్యూబ్ ఛానల్ బ్లాక్‌మెయిలింగ్, వేధింపుల కేసు విచారణలో తాజాగా మరో సంచలన నిజాన్ని వెలుగులోకి వచ్చింది. అనంతపురం జిల్లా కల్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబును వ్యక్తిగతంగా, రాజకీయంగా దెబ్బతీయడానికి ఈ యూట్యూబ్ ముఠా పెద్ద ఎత్తున కుట్ర పన్నినట్లు అంతర్గత విచారణలో బయటపడింది. 'ప్రశ్న' నిర్వాహకుడు జోసెఫ్ అలియాస్ రావణ్, అతని అనుచరులు చాలా కాలంగా ఎమ్మెల్యేకు వేధింపులు గురిచేసినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది.ఎమ్మెల్యే సురేంద్ర బాబుపై సమాజంలో అప్రతిష్ట తెచ్చేలా తప్పుడు అవినీతి ఆరోపణలతో వీడియోలు రూపొందించడం వెనుక కీలక సూత్రధారుల లింకులు బయటపడ్డాయి. ఈ కుట్ర వెనుక వైసీపీ నేత ఉమామహేశ్వర్ నాయుడి సోదరుడు ఇంద్రసేననాయుడు ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు లభించాయి. ఆయనతో పాటు 'ప్రశ్న' యూట్యూబ్ ఛానల్ సీఈవో గమన కూడా ఈ ప్లాన్‌లో భాగస్వామి అయి, తెరవెనుక స్క్రిప్ట్ డిజైనింగ్, ఫండింగ్‌వ్యవహారాలను నడిపించినట్లు జిల్లావ్యాప్తంగా జోరుగా చర్చ సాగుతోంది.కూటమి ప్రభుత్వానికి చెందిన ప్రజాప్రతినిధులను టార్గెట్ చేస్తూ విపక్షాలు, కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ఇటువంటి విషప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇదివరకే పార్టీ నేతలకు సూచించారు. తాజా పరిణామాల నేపథ్యంలో గమన, ఇంద్రసేన నాయుడుల వ్యవహారంపై పోలీసులుదర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ డిజిటల్ నెట్‌వర్క్ వెనుక ఉన్న మరికొంతమంది కీలక వ్యక్తుల కాల్ డేటా, ఆర్థిక లావాదేవీలను వెలికితీసేందుకు గన్నవరం పోలీసులు తదుపరి చర్యలకు
**సిద్ధమవుతున్నారు.**

వెనక్కి తగ్గిన పోలీసులు

యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడు బచ్చులకూరి జోసెఫ్ అలియాస్ ప్రసన్న రావణ్ కేసు విచారణలో ఊహించని మలుపు చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా రావణ్‌ను 10 రోజుల పాటు తమ
కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై గన్నవరం కోర్టులో విచారణ జరిగింది. అయితే, నాటకీయ పరిణామాల మధ్య ఆ కస్టడీ పిటిషన్‌ను తాము వెనక్కి (ఉపసంహరణ)తీసుకుంటున్నట్లు పోలీసుల తరఫు న్యాయవాది న్యాయస్థానానికి అధికారికంగా తెలియజేశారు.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలతో పాటు మావోయిస్టు భావజాల వ్యాప్తి, సాయుధతిరుగుబాటును ప్రోత్సహించేలా మాట్లాడారనే తీవ్రమైన ఆరోపణలపై గన్నవరం పోలీసులు రావణ్‌పై ఉపా (ఖ్రూాూా) చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన సంగతి తెలిసిందే. ఈ కేసు
మూలాలను, ఆర్థిక లావాదేవీలను వెలికితీసేందుకు 10 రోజుల పోలీసు కస్టడీ అవసరమని గత శుక్రవారం పోలీసులు కోరారు. అయితే, ఈ కేసులో 'ప్రశ్న' యూట్యూబ్ ఛానల్ సీఈఓ గమనతో పాటుపలువురు కీలక వ్యక్తులను గన్నవరం డీఎస్పీ కార్యాలయంలో పోలీసులు ఇప్పటికే సుదీర్ఘంగా విచారించి అవసరమైన వివరాలు, డిజిటల్ ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది.రావణ్ కస్టడీ అవసరం
లేదని భావించి పోలీసులు వెనక్కి తగ్గినట్లు న్యాయవర్గాల్లో చర్చ సాగుతోంది. పోలీసులు కస్టడీ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడంతో జోసెఫ్ రావణ్ ప్రస్తుతానికి నెల్లూరు సెంట్రల్ జైల్లోనే జ్యుడీషియల్‌రిమాండ్‌లో కొనసాగనున్నారు. మరోవైపు, ఈ కేసులో ప్రభుత్వం కావాలనే ఉపా వంటి కఠిన చట్టాలను అక్రమంగా ప్రయోగిస్తోందని రావణ్ తరఫు న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి కోర్టు వెలుపల తీవ్రఆరోపణలు చేశారు. తనపై నమోదైన పలు కేసులను ఒకే కేసుగా విచారించాలని కోరుతూ రావణ్ ఇప్పటికే ఏపీ హైకోర్టును కూడా ఆశ్రయించారు. పోలీసుల తాజా ఉపసంహరణ నిర్ణయంతో ఈ పొలిటికల్‌అండ్ లీగల్ డ్రామా ఏ మలుపు తిరుగుతుందో అన్నది ఆసక్తికరంగా మారింది

# గోదావరి జిల్లాలపై నేతల గురి




**రాజమండ్రి, జూలై 15 పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గోదావరి ప్రాంతానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. ముఖ్యంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు ) జిల్లాల్లో రాజకీయ పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడం కొత్త విషయం కాదు. ఈ ప్రాంతంలో రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉండటంతో పాటు ఎన్నికల సమయంలో ప్రజల తీర్పు కూడా రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపుతుందని విశ్లేషకులు భావిస్తుంటారు. అందుకే అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ గోదావరి జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుంటాయి.ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరుస జిల్లా పర్యటనలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కొద్ది రోజుల క్రితం రాయలసీమ ప్రాంతంలోని తిరుపతి చిత్తూరు , కడప, అన్నమయ్య జిల్లాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఇప్పుడు గోదావరి జిల్లాల పర్యటన ప్రారంభించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించడంపై దృష్టి పెట్టారు.ఈ పర్యటనలో భాగంగా తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో పలు కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద గేట్ల పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని కూడా సమీక్షించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు వెల్లడిస్తున్నారు.మరోవైపు ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి
వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా గోదావరి జిల్లాలపై దృష్టి కేంద్రీకరించారు. గత ఎన్నికల అనంతరం ఈ ప్రాంతంలో పెద్దగా పర్యటించని ఆయన, ఇప్పుడు పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం ( పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా వచ్చే 15న ఆక్వా రైతులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు,
రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, మార్కెట్ పరిస్థితులు వంటి అంశాలను జగన్ ప్రస్తావించే అవకాశం ఉందని సమాచారం. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసే అవకాశము ఒదని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.సార్వత్రిక ఎన్నికలకు ఇంకా కొంత సమయం ఉన్నప్పటికీ, స్థానిక సంస్థల ఎన్నికలపై ఇప్పటికే రాజకీయ పార్టీల దృష్టి పడింది. అందుకే అధికార పార్టీతో పాటు ప్రతిపక్షం
కూడా ప్రజల్లో చురుకుగా ఉండేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు కనిపిస్తోంది. ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ తమ
~ాజకీయ కార్యాచరణను వేగవంతం చేసే దిశగా అడుగులు వేస్తున్నాయి.ఒకే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతిపక్ష నేత జగన్ ఇద్దరూ గోదావరి ప్రాంతంలో పర్యటనలు చేపట్టడం రాజకీయంగా ఆసక్తికర పరిణామంగా మారింది. ఈ
పర్యటనలు స్థానిక రాజకీయాలపై మాత్రమే కాకుండా, రాబోయే ఎన్నికల వ్యూహాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గోదావరి జిల్లాల్లో మొదలైనఈ రాజకీయ చురుకుదనం రానున్న రోజుల్లో రాష్ట్ర రాజకీయాలను మరింత వేడెక్కించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# భారత్ జం పాక్ మ్యాచ్‌ల కోసం ఐసీసీ సంచలన మార్పులు.. క్రికెట్ ఫ్యాన్స్‌కు బిగ్ షాక్!



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (×జజ) ప్రపంచ క్రికెట్ అభిమానులకు సరికొత్త మజాను అందించేందుకు సిద్ధమైంది. ఎడిన్‌బర్గ్‌లో ముగిసిన వార్షిక సమావేశంలో, ఐసీసీ బోర్డు రెండు మెగా టోర్నమెంట్ల ఫార్మాట్లలో విప్లవాత్మక మార్పులను అధికారికంగా ప్రకటించింది. టోర్నీ ప్రారంభ దశ నుంచే ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా కొనసాగించాలనే ఉద్దేశంతో ఈ సంచలన నిర్ణయం తీసుకుంది. 2027లో జరగబోయే పురుషుల వన్డే ప్రపంచకప్‌తో పాటు 2028లో జరిగే టీ20 ప్రపంచకప్‌ల కొత్త రూపురేఖలు ఎలా ఉండబోతున్నాయో ఇప్పుడు తెలుసుకుందాం..

**2027 వన్డే ప్రపంచకప్:**

దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాల సంయుక్త ఆతిథ్యంలో 2027లో జరగనున్న వన్డే ప్రపంచకప్ 14 జట్లతోనే జరగనుంది. కానీ, ఈసారి టోర్నీ కేవలం గ్రూప్ మ్యాచ్‌లతో కాకుండా సరికొత్త నాలుగు దశల ఫార్మాట్‌లో సాగనుంది.

మొదటి దశ (సూపర్ సిరీస్): అర్హత సాధించిన 14 జట్లలో అత్యంత తక్కువ ర్యాంకింగ్ కలిగిన చివరి 3 జట్లు మొదట సూపర్ సిరీస్ రౌండ్ -రాబిన్ లీగ్‌లో తలపడతాయి. వీటిలో కేవలం ఒకే ఒక జట్టు తదుపరి గ్రూప్ దశకు అర్హత సాధిస్తుంది, మిగిలిన రెండు జట్లు టోర్నీ ప్రారంభంలోనే వెనుదిరుగుతాయి.

రెండో దశ (గ్రూప్ స్టేజ్): మిగిలిన 12 జట్లను రెండు గ్రూపులుగా (ఒక్కో గ్రూప్‌లో 6 జట్లు) విభజిస్తారు. లీగ్ మ్యాచ్‌లు పూర్తయిన తర్వాత.. ప్రతి గ్రూప్ నుంచి టాప్--3 స్థానాల్లో నిలిచిన జట్లతో పాటు రెండు గ్రూపుల్లో కలిపి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఒకే ఒక్క నాలుగో స్థాన జట్టు (మొత్తం 7 జట్లు) సూపర్ 7 దశకు చేరుకుంటాయి.

మూడో దశ (సూపర్ 7): ఈ 7 జట్ల మధ్య రౌండ్-రాబిన్ పద్ధతిలో 21 లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఇందులో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

నాలుగో దశ (నాకౌట్స్): సెమీఫైనల్స్ లో మొదటి స్థానంలో నిలిచిన జట్టు నాలుగో స్థానంలోని జట్టుతో, రెండో స్థానంలో ఉన్న జట్టు మూడో ప్లేస్ లోని టీమ్ తో తలపడతాయి. విజేతలు ఫైనల్స్‌లో తలపడి ట్రోఫీ కోసం పోరాడతారు.

**భారత్- పాక్ పోరు.. ఒకే టోర్నీలో రెండుసార్లు ఫైట్:**

క్రికెట్ ప్రపంచంలోనే అత్యంత క్రేజ్ ఉన్న భారత్ వర్సెస్ పాకిస్తాన్ మ్యాచ్‌ల విషయంలో ఈ కొత్త ఫార్మాట్ అభిమానులకు డబుల్ ధమాకా ఇవ్వనుంది. ఈ కొత్త నియమాల ప్రకారం భారత్, పాకిస్తాన్ జట్లు ఒకే గ్రూప్‌లో ఉంటే గనుక.. ఈ మెగా టోర్నీలో కనీసం రెండుసార్లు తలపడే అవకాశం లభిస్తుంది. మొదట గ్రూప్ దశలో ఒకసారి ముఖాముఖి పోరాడగా, ఆ తర్వాత ఇరు జట్లు క్వాలిఫై అయి సూపర్ 7 దశకు చేరితే అక్కడ రెండోసారి తలపడే లక్కీ ఛాన్స్ దక్కుతుంది.

**2028 టీ20 ప్రపంచకప్:**

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ఆతిథ్యమివ్వనున్న 2028 టీ20 ప్రపంచకప్ కూడా 20 జట్లతోనే కొనసాగినప్పటికీ, దీని ఫార్మాట్‌లో ఉత్కంఠను రెట్టింపు చేసేలా మార్పులు చేశారు.

**గ్రూప్ దశ:** గతంలో నాలుగు గ్రూపులుగా ఉన్న 20 జట్లను, ఇప్పుడు ఐదు గ్రూపులుగా (గ్రూప్‌నకు 4 జట్లు చొప్పున) విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్-2 స్థానాల్లో నిలిచిన జట్లు (మొత్తం 10 జట్లు) సూపర్ 10 దశకు చేరుకుంటాయి.

**సూపర్ 10:** ఈ 10 జట్లను రెండు గ్రూపులుగా (గ్రూప్‌నకు 5 చొప్పున) విభజిస్తారు. ఈ రెండు గ్రూపుల్లో అగ్రస్థానంలో (1వ స్థానం) నిలిచిన జట్లు నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

**ఎలిమినేటర్స్:** మిగిలిన రెండు సెమీఫైనల్ స్థానాల కోసం సరికొత్తగా ఎలిమినేటర్స్ రౌండ్ ప్రవేశ పెట్టారు. ఒక గ్రూప్‌లోని రెండో స్థానంలోని జట్టు, మరో గ్రూప్‌లోని మూడో ప్లేస్ లోని టీమ్ తో తలపడుతుంది. వీటిలో విజేతలుగా నిలిచిన రెండు జట్లు మిగిలిన రెండు సెమీఫైనల్ స్థానాలను భర్తీ చేస్తాయి. ఆ తర్వాత సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు జరుగుతాయి. కాగా ఐసీసీ తీసుకున్న ఈ సమూల మార్పులు టోర్నీ ప్రారంభం నుంచే ప్రతి ఒక్క మ్యాచ్‌ను చావో రేవో తేల్చుకునేలా చేసి, ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందించడం ఖాయంగా కనిపిస్తోంది.

# లంకా ప్రీమియర్ లీగ్ 2026 షెడ్యూల్ రిలీజ్.. జట్లు, లైవ్ స్ట్రీమింగ్, కొత్త రూల్స్ ఇవే!






**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ అభిమానులకు సరికొత్త టీ20 వినోదాన్ని అందించేందుకు లంక ప్రీమియర్ లీగ్ 6వ ఎడిషన్ సిద్ధమైంది. రేపటి (జూలై 17) నుంచి ఆగస్టు 8 వరకు శ్రీలంక వేదికగా ఈ ప్రతిష్టాత్మక లీగ్ జరగబోతోంది. గత 2025 ఎడిషన్ శ్రీలంక బోర్డు టీ20 ప్రపంచకప్ వేదికల సన్నద్ధత కోసం రద్దు చేయడంతో.. ఈసారి సరికొత్త జోష్‌తో టోర్నీ తిరిగి రాబోతోంది. కొలంబో, దంబుల్లా, పల్లెకెలె వేదికలుగా మొత్తం 24 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ టోర్నీలో ఐదు ఫ్రాంచైజీలు తలపడనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్స్ జాఫ్నా కింగ్స్, గాలే గ్యాలెంట్స్ మధ్య కొలంబోలోని ఎస్ఎస్‌సీ (గ్రౌజ) మైదానంలో తొలి మ్యాచ్‌తో ఈ మెగా టోర్నీ అట్టహాసంగా ప్రారంభం కానుంది.

**ఐదు జట్లు:**

ఈసారి టోర్నమెంట్‌లో పాల్గొనే జట్ల యాజమాన్యాలు మారడంతో పాటు వాటి పేర్లు కూడా ఆసక్తికరంగా మారాయి.

జాఫ్నా కింగ్స్ (జీుటటఖు ఖఱఅస్త్రం): (గతంలో జాఫ్నా టైటాన్స్).

గాలే గ్యాలెంట్స్: (గతంలో గాలే మార్వెల్స్).

కొలంబో క్యాప్స్ : (గతంలో కొలంబో స్ట్రైకర్స్).

క్యాండీ రాయల్స్ : (గతంలో క్యాండీ ఫాల్కన్స్).

దంబుల్లా సిక్సర్స్: దినేష్ చండీమల్ కెప్టెన్సీలోని బలమైన జట్టు.

**సరికొత్త రూల్స్:**

ఈ సారి లంక ప్రీమియర్ లీగ్‌ను మరింత ఉత్కంఠభరితంగా మార్చేందుకు సరికొత్త నిబంధనలను తీసుకువచ్చారు.

ఇంపాక్ట్ సబ్ : ఐపీఎల్ తరహాలోనే ఎల్పీఎల్‌లో కూడా మొదటిసారిగా 'ఇంపాక్ట్ సబ్' నిబంధనను ప్రవేశపెడుతున్నారు.

అండర్-23 రూల్: ప్రతి జట్టు తమ ప్లేయింగ్ శ×లో కనీసం ఒక అండర్-23 (23 ఏళ్ల లోపు) ఆటగాడిని తప్పనిసరిగా ఆడించాల్సిందే. ఇంపాక్ట్ సబ్ వాడినప్పటికీ మైదానంలో ఒక అండర్-23 క్రీడాకారుడు ఉండాల్సిందే.

స్లో ఓవర్ రేట్ పెనాల్టీ: మ్యాచులు త్వరగా ముగిసేలా స్లో ఓవర్ రేట్ వేసే కెప్టెన్లకు కఠినమైన పెనాల్టీలు విధించనున్నారు.

**ప్లేఆఫ్స్ వివరాలు:**

లీగ్ దశలో ఐదు జట్లు మిగిలిన జట్లతో రెండేసి మ్యాచ్‌లు (డబుల్ రౌండ్-రాబిన్) ఆడుతాయి.

లీగ్ ముగిసే సమయానికి పాయింట్ల పట్టికలో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి.

క్వాలిఫైయర్ 1: పాయింట్ల పట్టికలో 1, 2 స్థానాల్లోని జట్ల మధ్య పోరు జరుగుతుంది. గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు వెళ్తుంది.

ఎలిమినేటర్: 3, 4 స్థానాల్లోని జట్ల మధ్య పోరు జరుగుతుంది. ఇందులో ఓడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది.

క్వాలిఫైయర్ 2: క్వాలిఫైయర్ 1లో ఓడిన జట్టు, ఎలిమినేటర్ విజేత మధ్య మ్యాచ్ జరుగుతుంది. ఇందులో గెలిచిన జట్టు ఫైనల్ కి వెళ్తుంది.

**ఎల్పీఎల్ 2026 పూర్తి షెడ్యూల్:**

జూలై 17: జాఫ్నా కింగ్స్ జం గాలే గాలెంట్స్

జూలై 18: క్యాండీ రాయల్స్ జం దంబుల్లా సిక్సర్స్, గాలే గాలెంట్స్ జం కొలంబో కాప్స్

జూలై 19: దంబుల్లా సిక్సర్స్ జం జాఫ్నా కింగ్స్, కొలంబో కాప్స్ జం క్యాండీ రాయల్స్

జూలై 21: దంబుల్లా సిక్సర్స్ జం క్యాండీ రాయల్స్

జూలై 22: జాఫ్నా కింగ్స్ జం కొలంబో కాప్స్, దంబుల్లా సిక్సర్స్ జం గాలే గాలెంట్స్

జూలై 23: క్యాండీ రాయల్స్ జం కొలంబో కాప్స్, గాలే గాలెంట్స్ జం జాఫ్నా కింగ్స్

జూలై 25: గాలే గాలెంట్స్ జం క్యాండీ రాయల్స్, దంబుల్లా సిక్సర్స్ జం కొలంబో కాప్స్

జూలై 26: క్యాండీ రాయల్స్ జం జాఫ్నా కింగ్స్, గాలే గాలెంట్స్ జం దంబుల్లా సిక్సర్స్

జూలై 28: కొలంబో కాప్స్ జం జాఫ్నా కింగ్స్

జూలై 29: గాలే గాలెంట్స్ జం క్యాండీ రాయల్స్, కొలంబో కాప్స్ జం దంబుల్లా సిక్సర్స్

జూలై 30: జాఫ్నా కింగ్స్ జం క్యాండీ రాయల్స్

ఆగస్టు 1: కొలంబో కాప్స్ జం గాలే గాలెంట్స్

ఆగస్టు 2: జాఫ్నా కింగ్స్ జం దంబుల్లా సిక్సర్స్

ఆగస్టు 5: క్వాలిఫయర్ 1 (మధ్యాహ్నం 3:00), ఎలిమినేటర్ (రాత్రి 7:30)

ఆగస్టు 7: క్వాలిఫయర్ 2

ఆగస్టు 8: ఫైనల్

**లైవ్ స్ట్రీమింగ్ వివరాలు:**

భారతదేశంలోని క్రికెట్ అభిమానులు ఈ టోర్నమెంట్‌ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెళ్లలో టీవీ ద్వారా ప్రత్యక్ష ప్రసారంగా వీక్షించవచ్చు. అలాగే డిజిటల్ మొబైల్ వీక్షకులు ఫ్యాన్‌కోడ్ యాప్, వెబ్‌సైట్ ద్వారా లైవ్ స్ట్రీమింగ్ ఆస్వాదించవచ్చు. శ్రీలంకలో SLTMobitel/PEOTV ద్వారా ఈ ప్రసారాలు అందుబాటులో ఉంటాయి.

పూజా హెగ్డే గ్రేస్, గ్లామర్ మరియు పెరుగుతున్న స్టార్‌డమ్



# సమంత సీమ వంటకాలు నేర్చుకుంటుందా?



సమంత వ్యక్తిగత జీవితంలో తీసుకుంటున్న మార్పులు - అభిరుచులు సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారుతున్నాయి. నాగ చైతన్యతో వివాహం జరిగిన సమయంలో తనకు వంట చేయడం పెద్దగా రాదని, వంట గదిలో గడపడం కంటే పని మీదనే ఎక్కువ దృష్టి పెడతానని బహిరంగంగానే వెల్లడించారు. తాజాగా అదే సమంత మనసంతా వంటగదిపైనే ఉందన్నది ఇప్పుడు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ప్రస్తుతం రాయలసీమ రుచులను నేర్చుకోవడంలో నిమగ్నమైందని తెలిసింది. రాయలసీమ వంటకాలు అనగానే ఘాటైన మసాలాలు, ప్రత్యేకమైన తయారీ పద్ధతులు గుర్తుకొస్తాయి. సామ్ సన్నిహితుల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం సమంత ఎంతో శ్రద్ధగా ఈ వంటకాలను నేర్చుకుంటున్నారు. ముఖ్యంగా సీమ రుచుల ప్రత్యేకతను ఎంతో ఎంజాయ్ చేస్తున్నారని తెలిసింది. ఒకప్పుడు వంటకు దూరంగా ఉన్న సమంత ఇప్పుడు ఇష్టంగా వంటగదిలో సమయం గడపడం అభిమానుల్ని సర్ ప్రైజ్ చేస్తుంది. సమంత ఈ నిర్ణయం తీసుకోవడానికి ఆమె వ్యక్తిగత జీవితంలో జరిగిన పరిణామాలే కారణమని నెటిజన్లు భావిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమంత ఇంటికే పరిమితమై, ప్రశాంతమైన జీవనాన్ని గడుపుతున్నారు. గర్భవతి కావడంతో ఈ సమయంలో బయట తిరుగుళ్లు తగ్గించి ఇంట్లోనే ఉండటం ఆమెకు వంటపై ఆసక్తిని పెంచేలా చేసిందని తెలుస్తోంది. ఇంటి వాతావరణం, కుటుంబ సభ్యుల మధ్య గడపడం కొత్త అనుభూతిని అందిస్తుందని చెప్పొచ్చు. నటిగా కెరీర్‌లో బిజీగా ఉన్నప్పుడు వంటపై దృష్టి పెట్టడం కుదరకపోవచ్చు. కానీ ఇప్పుడు లభించిన విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. వంట కేవలం ఆకలి తీర్చుకోవడం మాత్రమే కాదు. అది ఒక కళ అని దానిని ఆస్వాదిస్తూ చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని సమంత కూడా భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఆరోగ్యకరమైన, రుచికరమైన ఇంటి భోజనం గర్భవతిగా ఆమెకు ఎంతో మేలు చేకూరుస్తుంది. తెలుగు వ్యక్తిని వివాహం ( రాజ్ నిడిమోరు) చేసుకున్న తర్వాత సంప్రదాయాలు , రుచులపై సమంతకు మక్కువ పెరిగిందని చెప్పడంలో సందేహం లేదు. తెలుగు వంటకాలకు, ముఖ్యంగా సీమ వంటకాలకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ రుచులను స్వయంగా వండి రుచి చూడటంలో ఉన్న తృప్తి వేరే ఏ ఆహారంలోనూ ఉండదు. సమంత వంటకాలను వండి కుటుంబ సభ్యులకు వడ్డించడంలో ఓ కొత్త ఆనందాన్ని పొందుతున్నారని సన్నిహితులు చెబుతున్నారు. ఇటీవలే రిలీజ్ అయిన -మా ఇంటి బంగారం- చిత్రంలో నక్సలైట్...ఓ ఇంటి కోడలి పాత్రలో ఎలా అరించారో? తెలిసిందే. వంట తెలియని సమంత వంటల్లో స్పెషలిస్ట్ అని చెప్పుకుని కుటుంబంలో హైలైట్ అవుతుంది. అది రీల్ సీన్ అయినా? ఇప్పుడు రియల్ గా రాయలసీమ వంటకాలు నేర్చుకుంటూ రియల్ గానూ అత్తింటి కుటుంబంలో మంచి వంట గత్తెను అనిపించు కుంటోంది.



ఎమరాల్డ్ కార్సెట్ లుక్‌లో రాశి ఖన్నా తలదాచుకుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at 38/291-6, Sreerama nagar colony, Near Central prison, KADAPA CITY, KADAPA DISTRICT, ANDHRAPRADESH-516002, Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2231, editorpenpower@gmail.com